

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

మంగళవారం, 29 జులై 2025 | 8 పేజీలు

సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ నిర్మాణం పనుల పరిశీలన

- కిచెన్ నిర్మాణం పనులపై సూచనలు ఇచ్చిన కలెక్టర్ శ్రీధర్
- శతాబ్ది పాఠశాల గురించి వివరించిన ఎమ్మెల్యే ఆది

విశాలాంధ్ర-యర్రగుంట్ల: జమ్మలమడుగు పర్యటనలో భాగంగా.. సోమవారం జమ్మలమడుగు పట్టణంలోని పతంగి రామన్న రావు (పీఆర్) శతాబ్ది ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ లతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి. ప్రస్తుతం నిర్వహణలో ఉన్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నిర్వాహణ ఎలా సాగుతోందని అడుగుతూ.. కిచెన్ నిర్మాణ పనులు చేపడుతున్న ఇంజనీరింగ్ అధికారులకు మోడల్ కిచెన్ నిర్మాణ పనులపై పలు సూచనలు ఇచ్చిన జిల్లా కలెక్టర్. ఈ కార్యక్రమంలో స్థానిక యువ నాయకులు భూపేష్ రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, బద్వేలు ఆర్టీవో చంద్ర మోహన్, సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్స్ నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, హౌసింగ్ పీడి రాజరత్నం, ఏపీఎస్పీడిసిఎల్, ఆర్డబ్ల్యూఎస్, పీఆర్, ఎస్ఎస్ఏ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, తహసీల్దార్ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ ఆలింగనం..

మానసిక ఒత్తిడి మటుమాయం..

విశాలాంధ్ర-సింహాద్రిపురం: పాఠశాలలు పునః ప్రారంభమై పాఠ్యాంశాల బోధన మొదలైంది. వేసవి కాలమంతా ఆటపాటలతో గడిపిన విద్యార్థులు ఇప్పుడు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఇటీవల తల్లిదండ్రులు ర్యాంకుల పేరిట పిల్లలపై ఒత్తిడి పెంచడం ఆందోళనకరంగా మారింది. అభిరుచి ఆలోచనలు తెలుసుకోకుండా వివరిస్తుండడంతో ఆత్మవిశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉంది. తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పాత్ర కీలకం.

ఆటపాటలే ఆరోగ్య రక్ష..

బరువైన పుస్తకాల సంచులు తరగతిలో పాఠాలు, హోంవర్క్‌తో పిల్లలు ఒత్తిడికి గురవుతున్నారు. శారీరిక వ్యాయామం లేకపోవడంతో మెదడు చురుకుదనం కోల్పోతుంది.

2లో

నామినేటెడ్.. నైరాశ్యం..!

ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పదవులపై జిల్లాలోని కూటమి భాగస్వాములైన టిడిపి, జనసేన, బీజేపీ నేతలు పెదవి విరుస్తున్నారు. పదవులపై ఆశలు పెంచుకున్న నేతలు ఇటీవల విడుదల చేసిన జాబితా చూసి నీరుగారి పోతున్నారు. పార్లమెంటు కేంద్రమైన రాజంపేట నియోజకవర్గ కేంద్రంలో ఉన్నటువంటి టిడిపి, బీజేపీ, జనసేన ముఖ్య నేతలైతే పదవుల పందేరంపై చిర్రుబుర్రులాడుతున్నారు. అవకాశం కోసం ఎదురు చూసిన నేతలు ఇక తమకు వస్తాయా.. రావా అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు టిడిపిని అసంతృప్తి వరుస్తూనే ఇంకోవైపు బిజెపి, జనసేన బుజ్జగించాల్సి వస్తోంది. రెండు పార్టీల్లో ఆశావహుల సంఖ్య డజన్ల సంఖ్యలోనే ఉంది. ఆ మేరకు ఇరు పార్టీల్లోను పెద్ద ఎత్తున ఒత్తిడి తేవాలని క్షేత్ర "స్థాయి నేతలు ఇప్పటికే వ్యూహానికి దిగారు. తమ పార్టీ రాష్ట్ర నాయకత్వాలను ఒప్పించి మెప్పించి ఆయా పదవుల్లో తాము కూడా నామినేట్ కావాలనే ఆంక్ష వారిలో బలంగా ఉంది.

- విశాలాంధ్ర-రాజంపేట



అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలో తప్ప అన్ని నియోజకవర్గాలలో పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులను కేటాయించారు. రాజంపేట నియోజకవర్గంలో మాత్రం ఆరు విడతలగా విడుదల చేసిన జాబితాలో ఇప్పటి వరకు క్షత్రియ వర్గానికి చెందిన ఒకరికి మాత్రమే అవకాశాన్ని కల్పించారు. కూటమి సర్కార్లోని భాగస్వామ్య దామాషా పద్దతి ప్రకారమే నామినేటెడ్ పదవులు కేటాయించామని టీడీపీ అధిష్టానం చెబుతుంది. అయితే రాజకీయ నేపథ్యంలో కేటాయించిన సీట్లకు, నామినేటెడ్ పదవుల కేటాయింపుకు ముడిపెట్టడం సరికాదని జనసేన, బీజేపీ నేతలు చెబుతున్నారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీ కేంద్రం నుండి పోటీ చేసిన అభ్యర్థి ఓటమి చెందడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజంపేటపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక జిల్లావ్యాప్తంగా మిగతా నియోజక వర్గాల్లోను పదవులను ఆశించే క్యాడర్ సంఖ్య తక్కువేమీ కాదు. ఈ మేరకు నామినేటెడ్ జాబితాలో తమ పేరు ఉండాలనే రీతిలోనే పట్టుపడుతున్నారు.

- ఆశలు పెంచుకున్న నేతలకు ప్రతిసారి మొండిచేయి
- బీజేపీ, జనసేన, ఆశావహుల్లో తీవ్ర అసంతృప్తి
- ఇరుపార్టీల అధినేతలపై ముఖ్యనేతలు అసహనం
- ప్రస్తుతం ఇరు పార్టీల్లో ఇదే చర్చ

2లో

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

విశాలాంధ్ర-రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలను నిర్లక్ష్యం చూపకుండా వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సమస్యకు సంబంధించిన పరిష్కారంతో పాటు ప్రజల నుంచి సేకరించిన ఫీడ్ బ్యాక్‌ను కూడా ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందని, ఈ విషయాన్ని గుర్తెరిగి అధికారులందరూ ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించే దిశలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీదారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఏడి సర్వేయర్ భరత్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అన్నమయ్య పోలీసు శాఖకు అరుదైన గౌరవం

- ప్రశంసా పత్రం అందుకున్న ఎస్పీ

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లా పోలీసులు, జులై 2024 నుండి జూన్ 20 25 మధ్య కాలంలో 30 వేలకు పైగా పాస్ పోర్ట్ దరఖాస్తులను గడువు లోపలే అత్య ంత వేగవంతంగా విచారణ పూర్తి చేసి, అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచి రాష్ట్రవ్యాప్తంగా మొదటి స్థానం సాధించి గొప్ప విజయాన్ని నమోదు చేశారు. విజయవాడ ప్రాంతీయ పాస్ పోర్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాంతీయ పాస్ పోర్ట్ అధికారి కె.శివ హర్ష చేతుల మీదుగా అన్నమయ్య జిల్లా పోలీసు విభాగం తరుపున జిల్లా స్పెషల్ బ్రాంచ్ విభాగం సీఐ రాజారమేష్ అవార్డును అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పాస్ పోర్ట్ దరఖా స్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతంగా, సమర్ధవంతంగా నిర్వహించినందుకు, జిల్లా పోలీసుల సేవా నీరతికి, ఆధునిక సాం కేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ పౌర సేవలను మెరుగుపరచడంలో పోలీసు సిబ్బంది కృషికి దక్కిన గౌరవం అన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఈ గుర్తింపుతో మరింత ప్రోత్సాహంతో ముందుకు సాగుతుందని ఎస్పీ ఆకాంక్షించారు.

యువతి అదృశ్యంపై

కేసు నమోదు

విశాలాంధ్ర-సుండుపల్లె: మండల కేంద్రంలో యువతి సమీరా అదృశ్యంపై తల్లి నూర్జహాన్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ఉపాధి పనులు కల్పించండి'

విశాలాంధ్ర-గాలివీడు: ఉపాధి హామీ పని కల్పించడం లేదంటూ గోరాన్ చెరువు గ్రామానికి చెందిన అవుల సుశీలమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆమె ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలసి తనకు 100రోజులు పని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పలుమార్లు మండలంలోని ఉపాధి హామీ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లను పలుమార్లు పని కల్పించాల్సిందిగా కోరినప్పటికీ ఫలితం లేకపోవడంతో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందిం చాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికా రులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు జాయిం ట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ఎస్డీసి వెంకటపతి,సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి జెడ్పి సీఈవో రాములమ్మ డ్వామా పిడి ఆది శేషారెడ్డి, వ్యవసాయ శాఖ జెడి చంద్ర నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా నాగుల చవితి

విశాలాంధ్ర–తొండూరు: మండల వ్యాప్తంగా సోమవారం నాగుల చవితి పర్వదినం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ పండుగ పట్ల మహిళలు ఎక్కువగా శ్రద్ధ వహిస్తారు. ఉపవాసం చేయడం, పుట్టకు పాలు పోయడం పండుగ విశిష్టతకు అర్థం పడుతుంది. ఇలా చేయడం వల్ల సకల దోషాలు తొలగుతాయని, ఆరోగ్యం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. మంగళవారం ఉదయం మరో మారు పుట్టకు పాలు పోసి ఉపవాస దీక్షలు విరమించనున్నట్లు మహిళలు ఈ సందర్భంగా వెల్లడించారు.

ప్రకృతి పరిరక్షణ మనందరి బాధ్యత: జెవివి

విశాలాంధ్ర–సింహాద్రిపురం: ప్రకృతి పరిరక్షణ మనందరి బాధ్యతని జన విజ్ఞాన వేదిక జాతీయ సమాచార కార్యదర్శి సనావుల్లా పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జూలై 28వ తేదిన ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. మన జీవితంలో ప్రకృతి ప్రాముఖ్యతను, దాన్ని ఎందుకు పరిరక్షించాలో గుర్తుచేసే ముఖ్యమైన రోజు అన్నారు. ప్రపంచంలో జీవించే సమస్త ప్రాణులు ఈ ప్రకృతి ఒడిలో ఒదిగిపోతుంటాయని తెలిపారు. ప్రజలలో అవగాహన పెంచడం చాలా ముఖ్యమని తెలియజేశారు.

సమర్థుడైన ఉపాధ్యాయునికి మంచి గుర్తింపు ఉంటుంది

విశాలాంధ్ర–రైల్వేకోడూరు: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ విద్యాశాఖ అధికారులతో,తోటి ఉపాధ్యాయులతో విద్యార్థులతో మంచి సంబంధాలు కలిగి ఉండే ఉపాధ్యాయులకు విద్యా శాఖ పరంగాను సమాజ పరంగాను మంచి గుర్తింపు ఉంటుందని తెలుగు మాష్టారు సుబ్రమణ్యంరెడ్డి పేర్కొన్నారు. అనంతరాజుపేట జెడ్పి హైస్కూల్లో సుమారు ఆరు సంవత్సరాల పాటు పనిచేసి అందరి మన్ననలు పొంది బదిలీపై రాజంపేట పరిధిలోని కానుపల్లి జడ్పి హైస్కూల్కు బదిలీ అయిన శుభ సందర్భంగా సోమవారం అనంతరాజుపేట జడ్పి హైస్కూల్లో ప్రధానోపాధ్యాయురాలు లలితకుమారి అధ్యక్షతన జీవశాస్త్ర ఉపాధ్యాయులు కృష్ణకు ఘనంగా వీడ్కోలు సత్కారం జరిగింది. శాలువా కప్పి నిలువెత్తు పూల మాలతో ఘనంగా సన్మానించారు. సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ వివాద రహితునిగా సమర్థుడైన ఉపాధ్యాయులుగా పనిచేశారని ప్రశంసించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులు కృష్ణ మాట్లాడుతూ తన సర్వీసులో అనంతరాజుపేట జడ్పి హైస్కూల్ లో పని చేసిన కాలాన్ని ఎప్పుడూ మరచిపోనని ఉపాధ్యాయులు అందించిన సహకారం తాను గుర్తించుకుంటానని పేర్కొన్నారు. హిందీ కుమార్ సుధ జయలక్ష్మి తదితరులు వీడ్కోలు సత్కార సమావేశంలో పాల్గొన్నారు.

నామినేటెడ్.. నైరాశ్యం.!

మొదటి పేజీ తరువాయి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్దేశిత శాతం ప్రకారమే నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ జరగబోతుందని గతంలో అనేకమార్లు సీఎం చంద్రబాబు సూచాయగా ప్రకటించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అటు తెలుగుదేశం, కూటమిలో భాగస్వామ్యపక్షాలైన బీజేపీ, జనసేనలో గాని ఎవరికీ సరైన స్పష్టత లేదు. ఇదంతా క్షేత్రస్థాయిలో కొంత గందరగోళంగా మారింది.

టీడీపీ నేతలకు దక్కని పదవులు..

తెలుగుదేశం విషయానికి వచ్చేసరికి గత ఎన్నికల్లో టికెట్లు ఆశించి పొత్తు ధర్మంలో భాగంగా పోటీలో నిలబడకుండా పక్కకు జరిగిన సీనియర్లతో పాటు క్షేత్ర "స్థాయి కార్యకర్తలకు పోస్టులు దక్కేలా పక్కా ప్రణాళిక రూపొందించారు. తొలి జాబితాలో ఆ విధంగానే కూర్పు చేశారు. ప్రత్యేకించి టీడీపీలో అత్యంత కీలకమైన కార్పొరేషన్లలో సామాజిక వర్గపరంగా అవకాశం కల్పించే దిశగానే కసరత్తు సాగింది. అన్నింటినీ క్రోడీకరించి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే జాబితాకు ఓ రూపు వస్తుంది. ఎమ్మెల్సీ దగ్గర నుంచి కార్పొరేషన్ చైర్మన్లు, ఆఖరికి కేంద్రస్థాయిలో ఎఫ్‌సీఐ దగ్గర నుంచి రైల్వే వరకు ఎక్కడ వీలైతే అక్కడ సీనియర్లకు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే పక్కా ప్రణాళిక రూపొందించారు. అయితే ఇటీవల విడుదల చేసిన అసెంబ్లీ కేంద్రం నుండి పదవులు ఆశించిన వారికి తీవ్ర అసంతృప్తి మిగులుతోందని ఆరోపణలు వినపడుతున్నాయి. నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియలో తెలుగుదేశంలో కొంతలో కొంత స్పష్టత ఉన్నా బీజేపీ, జనసేనకు వచ్చేసరికి కాస్తంత గందరగోళంగా ఉన్నట్లు సమాచారం. చైర్మన్ పదవులు కాకుండా ఏదో ఒకటి పదవి తమకు అవకాశం వస్తుందా..? రాదా? అనే మీమాంస వారిలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఆ పార్టీకి చెందిన నేతలకే అగ్ర ప్రాధాన్యత ఉండబోతుంది. ఎటుతిరిగి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల భర్తీలో నెలకొన్న గందరగోళానికి రాష్ట్ర పార్టీ నేతలు సైతం సమాధానం ఇవ్వలేకపోతున్నారని ఈ రెండు పార్టీల్లోను నాయకులు కాస్త గుర్రుగానే ఉన్నారు. ఎందుకంటే తమ పార్టీ పక్షాన నామినేటెడ్ పోస్టులకు మీరు అర్హులు అంటూ జిల్లా స్థాయిలో జాబితాలు రూపొందించారా లేదా, ఒకవేళ రూపొందించి ఉంటే సూచాయగా అయినా జిల్లా పార్టీ అధ్యక్షులకు తెలిసేది కదా, అలా ఎందుకు తెలియకుండా గుట్టుగా ఉంచేశారేంటంటూ నిలదీస్తున్నారు. ఇప్పటిరకు పార్టీ కోసం కష్టించి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇవ్వడానికి టీడీపీ భారీ కసరత్తు చేస్తుండగా మిత్ర పక్షాల్లో ఉన్న తమకు అలాంటి అవకాశాలు వచ్చేటట్లు కనిపించడం లేదన్న అసంతృప్తి వీరందరిలోనూ ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కేంద్ర స్థాయి పదవులపై ఆశ..

కేంద్ర స్థాయిలో ఎఫ్సీఐ, రైల్వే, పౌర విమానయాన, డిఫెన్స్ సర్వీసెస్, పరిశ్రమల మండలి ఈ తరహా వాటన్నింటిలోనూ గతంలో బీజేపీకి చెందిన వారిలో కొందరికే అవకాశం కల్పించారు. ఆఖరికి నౌకాయాన విభాగంలోను తగిన రీతిలో నామినేట్ కావడానికి అప్పట్లో కొందరు ప్రయత్నించారు. మరి కొందరైతే బీఎస్ఎన్ఎల్లో సభ్యులుగా కావడానికి తమ వంతు ప్రయత్నాలు చేశారు. ఈసారి వీటన్నింటిపై బీజేపీలో ఉలుకు పలుకు లేనట్లు తెలుస్తోంది.

జనసేన నేతల్లోనూ అదే ఆందోళన..

జనసేన విషయంలోను పార్టీ టికెట్లను వివిధ నియోజకవర్గాల నుంచి అనేకమంది ఆశించారు. రాజంపేట పార్లమెంట్ అసెంబ్లీ నుంచి ఎల్లటూరు శ్రీనివాసరాజు, అతికారి కృష్ణ పోటీ పడినా పొత్తులో భాగంగా ఆ అవకాశం వారికి దక్కలేదు. ఇప్పుడు నామినేటెడ్ పోస్టుల విషయంలోను ఈ తరహా నేతలకు ఎలాంటి అవకాశాలు కల్పిస్తారనేది పార్టీపరంగా చర్చించేందుకు ఇప్పటివరకు ఎవరూ చొరవ తీసుకోకపోవడం విశేషం. ఈ పరిస్థితుల్లో ఈ రెండు పక్షాల్లోను కొంత గందరగోళం నెలకొనగా, ఇంకోవైపు పార్టీ అగ్ర నాయకత్వం దృష్టి పెట్టడం లేదని జన సైనికులు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల విషయానికి వచ్చేసరికి ఎవరూ సంతృప్తి పరచకపోవడంతో కొంతమేరకు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ పవన్ కళ్యాణ్ ఆదేశాల వరకు పార్టీ కార్యక్రమాలను రాజంపేటలో జోరుగా కొనసాగిస్తున్నారు. ఇంకోవైపు రానున్న జాబితాల్లో బీజేపీ, జనసేన నేతల పేర్లు చోటు చేసుకుంటాయన్న సంకేతాలు లేకపోలేదు.

పతకాలు సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందనలు

విశాలాంధ్ర–కడప కలెక్టరేట్: కఠోర శ్రమ, అలుపెరగని ప్రయత్నం, పట్టుదల విజేతల విజయ రహస్యమని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ రవీంద్ర నాథ్ అన్నారు. ఆర్ట్స్ కళాశాల నుంచి జూలై 15 నుంచి 25 వరకు సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఆర్మీ అటాచ్మెంట్ క్యాంపునకు ఎన్‌సిసి క్యాడెట్లు హాజరై అక్కడ నిర్వహించిన వాలీబాల్, కల్చరల్, డ్రిల్, టగ్ ఆఫ్ వార్ వంటి విభాగాలలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం జరిగింది. ఇందుకుగాను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్ర నాథ్ అభినందించడం జరిగింది. ఇందులో భాగంగా కళాశాల ఎన్‌సిసి అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ ఎన్‌సిసి క్యాడెట్లు ఈ క్యాంపు నందు రోజువారి సైనికుల దినచర్యను అనుసరిస్తూ వారు వినియోగించే ఆయుధాలు, కంపాస్, మ్యాప్ వంటి వాటిల్లో శిక్షణ పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి అధికారి లెఫ్టినెంట్ మహేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, అధ్యాపకులు డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ పి రవి శేఖర్, సావిత్రి, శివరాం, క్యాడెట్లు పాల్గొనడం జరిగింది.

ఆత్మీయ ఆలింగనం.. మానసిక ఒత్తిడి మటుమాయం..

ఉదయం, సాయంత్రం వేళలో వ్యాయామం, యోగాసనాలు సాధన పిల్లల్లో నాయకత్వ లక్షణాలు పెంపునకు స్నేహితులతో కలివిడిగా ఉండేందుకు దోహదపడుతుంది. చిత్రలేఖనతో సృజనాత్మకత పెరుగుతుంది.

ఆహారానికి ప్రాధాన్యం

హోటల్లో చిరుతిళ్లు ఇతర పదార్థాలు కాకుండా ఇంటి వంటకు ప్రధాన ఇవ్వాలి. ఆర్థిక స్తోమతకు అనుగుణంగా పాలు, ఖర్జూర, బొప్పాయి, డ్రైఫ్రూట్స్ అందించాలి. ఆ కూరలు, పప్పు, పాలకూర, గోంగూర, నెయ్యితో సంపూర్ణ భోజనం లభిస్తుంది.

అమ్మానాన్నలు ఇలా చేయండి

పిల్లలకు వ్యక్తిత్వ విలువలు తరచూ గుర్తు చేయాలి. సానుకూల దృక్పథంతో సమయాన్ని వినియోగించుకునేలా సిద్ధం చేయండి. ఇతరులతో పోలుస్తూ తమ పిల్లల ప్రతిభ తక్కువగా ఉందంటూ నిరాశకు గురి చేయొద్దు. ఇంటికి వచ్చిన పిల్లలను అలింగణం చేసుకుంటే ఆత్మీయ స్పర్శతో ఒత్తిడి మర్చిపోతారు. పాఠశాలలో ఇవి కీలకం విద్యతోపాటు మానవ విలువలు కష్టాలను ఎదుర్కొనే ధైర్యం శ్రమ తెలిసేలా చేతన పరచాలి ఖాళీ సమయాలలో కిచెన్, గార్డెన్ ,మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించండి స్థానిక చారిత్మాగా పర్యాటక ప్రదేశాలు విహారయాత్రలకు తీసుకెళ్లాలి.

శక్తి సామర్థ్యాలను గ్రహించాలి

పిల్లల అభిరుచి ఆలోచనలు శక్తి సామర్థ్యాలను గ్రహించాలని మండల విద్యాశాఖాధికారి ఓబులేసు తెలిపారు. వారిలో సానుకూల దృక్పథం పెంచేలా చూడాలి విమర్శనాత్మక ఆలోచనలతో సామర్థ్యాలను పెంపొందించొచ్చు అన్నారు. ఇతర పిల్లలతో కలివిడిగా ఉండటం ద్వారా సామాజిక సర్దుబాటు అలవాటు చేయాలన్నారు. మండల పరిధిలో 38 ప్రభుత్వ పాఠశాలలు, ఐదు ప్రైవేట్ పాఠశాలలు, ఒక ప్రభుత్వకస్తూర్బా కాలేజీ, ఉన్నాయి ఉన్నాయి. మొత్తం విద్యార్థుల సంఖ్య 3,318 మంది విద్యార్థులు ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

ఆర్.ఓ.సి.నెం. 260/A1/2025 నగరపాలక సంస్థ, కడప

బహిరంగవేలం ప్రకటన

తేది: 28.07.2025

కడప నగరపాలక సంస్థకు చెందిన మునిసిపల్ స్టేడియం పరిధిలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పక్కన వున్న ఖాళీ స్థలం నందు వ్యాపారం (టీ, కాఫీతో పాటు ఆరోగ్యానికి మేలు చేసే రాగి జావా, మిల్లెట్స్ వంటి మార్నింగ్ డ్రింక్స్ నిర్వహించుకోటకుగాను బహిరంగ వేలము 03 సంవత్సరములకు గాను అనగా తేది:01.09.2025 నుండి తేది: 31.08.2028 వరకు ఓపెన్ ఆక్షన్ తేది: 06.08.2025 న నగరపాలక సంస్థ సమావేశ భవనము నందు సాయంకాలం 4.00 గం॥లకు బహిరంగ వేలము జరుపబడును. కావున సదరు వేలములో పాల్గొనదలచిన వారు ఈ క్రింద కనబరచిన ప్రకారము సాల్వెన్సి సర్టిఫికేట్ తో పాటు వేలము డిపాజిట్టు చెల్లించి సంబంధిత దరఖాస్తునకు జతపరచి ఈ కార్యాలయము నందు వేలం పాట మొదలు పెట్టే సమయానికి అనగా తేది: 06.08.2025 ఉదయం 11.00 గం॥లోపు సమర్పించవలసి వుండవలెను. కడప నగరపాలక సంస్థ వారికి ఆస్తి, నీటి పన్నులు పూర్తిగా చెల్లింపు చేయవలసి వుండును. గత కాంట్రాక్టుల్లో కిస్తులు, స్టాంపు డ్యూటీలు, సర్వీసు టాక్సు మరియు ఇతరములు పాత బకాయిలు ఉన్నచో అటువంటి వారు సదరు వేలములో పాల్గొనుటకు అనుమతించబడదు. ఒక వేళ అట్టి బకాయిలు వున్నచో సదరు బకాయిలు అన్నియు పూర్తిగా నగరపాలక సంస్థ యందు చెల్లింపుచేసి బకాయిలు ఏమియును లేనట్టు నగరపాలక సంస్థ, కడప వారి ద్వార సర్టిఫికేట్ పొంది వేలములో పాల్గొనవలసియుండును.

వివరములు:–

క్రమ సంఖ్య	గుత్త వివరములు	చెల్లింపు చేయవలసిన డిపాజిట్టు	సమర్పించవలసిన సాల్వెన్సీ సర్టిఫికేట్ విలువ
1	కడప నగరపాలక సంస్థకు చెందిన మునిసిపల్ స్టేడియం పరిధిలో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ ప్రక్కన వున్న ఖాళీ స్థలం నందు వ్యాపారం (టీ, కాఫీతో పాటు ఆరోగ్యానికి మేలు చేసే రాగి జావా, మిల్లెట్స్ వంటి మార్నింగ్ డ్రింక్స్ నిర్వహించు కోటకుగాను	రూ. 10,000/-	రూ. 1,00,000/-

పై తెలిపిన డిపాజిట్ పే-ఆర్డరు / డి.డి రూపములో చెల్లింపు చేయవలసి ఉండును. హెచ్చుపాట పాడిన గుత్తదారుడు వేలము ముగిసిన పిదప డిపాజిట్‌తో కలిపి 1/4 వంతు వెంటనే చెల్లించవలెను. మిగిలిన మొత్తము 3/4 వంతు లీజు కేటాయించిన 18 మాసముల లోపల ప్రతి నెల 05వ తేది లోపల సర్వీసు టాక్స్ తో కలిపి చెల్లించవలెను. సదరు హెచ్చుపాట పాడిన మొత్తము 1/4 వంతు అనగా 25 శాతం చెల్లించిన పిదప మిగిలిన 3/4 అనగా 75 శాతంనకు పోస్ట్ డేటెడ్ చెక్కులు ఇవ్వవలసివుండును. మరియు గుత్తకాలమునకు సంబంధించి రిజిస్ట్రార్ వారి కార్యాలయము నందు గుత్తదరుడే తన సొంతఖర్చులతో రిజిస్టర్ చేయించుకొని ఈ కార్యాలయమునకు సమర్పించవలసి వుండును. మరియు ఏదైనా కారణము చేత వేలం, వాయిదా వేయు అధికారము లేదా రద్దు చేయుటకు కమీషనర్, గారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరములకు నగరపాలక సంస్థ కార్యాలయములోని రెవిన్యూ విభాగము నందు సంప్రదించి తెలుసుకొనవలసినదిగా ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సం/- యస్.మనోజ్ రెడ్డి, B.Tech.,
కమీషనర్,
కడప నగర పాలక సంస్థ

చెన్నూరు ఇన్చార్జ్ ఎంపీడీవోగా గంగాదేవి

విశాలాంధ్ర-చెన్నూరు : ఇన్చార్జ్ ఎంపీడీవోగా గంగాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న కిరణ్ మోహన్ రావు శిక్షణ నిమిత్తం 30 రోజుల పాటు శ్రీకాళహస్తికి వెళ్లారు. దీంతో జిల్లా పరిషత్ సీఈవో ఉత్తర్వుల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పని చేస్తున్న గంగాదేవిని ఇన్చార్జ్ ఎంపీడీవోగా నియమితులయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె అన్నారు.

ఘనంగా నాగుల చవితి

విశాలాంధ్ర -ముద్దనూరు : నాగులచవితి సందర్భంగా సోమవారం మండల వ్యాప్తంగా నాగులచవితి వేడుకలను మహిళలు ఘనంగా చేసుకున్నారు. నాగుల చవితిన పుట్టలో పాలు పోస్తే అష్టైశ్వర్యాలు చేకూరుతాయని భక్తుల విశ్వాసం. సౌభాగ్యానికి, సంతానప్రాప్తికి సర్పపూజ చేయడం అనాదిగా వస్తున్న సంప్రదా యం. కుజ, రాహుదోషాలున్నవారు, సాంసారిక బాధలున్నవారికి శుభం కలుగుతుందనే నమ్మకం. మహిళ లు మంగళకరంగా స్నానమాచరించి పుట్టలో పాలుపోసి నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

విశాలాంధ్ర- పెద్ద తిప్ప సముద్రం: గ్రీవెన్స్ డే సోమవారం ఉదయం 11.30 గంటలైనా సచివాలయం తలుపులు తీయకపోవడంతో సమస్యలపై వచ్చిన గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల స్థాయి అధికారుల పర్యవచన లోపంతో సచివాలయ అధికారులు ప్రతి కార్యాలయం ఉదయం 10 గంటలకు అధికారులు సిబ్బంది కార్యాలయానికి చేరుకోవాల్సి ఉన్న అధికారులు మాత్రం ఇష్టానుసారం కార్యాలయంలో విధులకు హాజరవుతున్నారని ప్రజలు ఆ గ్రామంలో రోపిస్తున్నారు. మండలంలోని తుమ్మరకుంట1 సచివాలయం సిబ్బంది 11-30 గంటలు కు సచివాలయం తలుపులు తీశారు .కార్యాలయ సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని పై అధికారులు ఓ పక్క చెబుతున్న గ్రామాలలో పనిచేసిన అధికారులు సమయపాలన పాటించడం లేదన్నారు. పలు సచివాలయాల్లో అధికారులు నిర్లక్ష్యంగా విధులకు హాజరవుతున్నారు. సమస్యలపై అధికారులకు విన్నవించిన సమస్య పరిష్కారానికి కృషి చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఏదో కార్యాలయానికి వచ్చామా తిరిగి వెళ్ళామా అన్న ధోరణితో వ్యవహరిస్తున్నారు. ప్రతి ఉద్యోగి ఉదయం ఎన్ని గంటలకు హాజరయ్యామని లొకేషన్ లో హాజరు అవ్వాల్సి ఉంది. కార్యాలయం నుండి తిరిగి వెళ్లాలన్న ఈ నిబంధనలు ఉన్నాయి.

ఆర్టీఓ కార్యాలయంలోనే ఎఫ్.సి సేవలు కొనసాగించాలి

ఆర్టీఓ కార్యాలయం వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ధర్నా

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లి ఆర్టీఓ కార్యాలయం పరిధిలోని ఆటో,ఇతర వాహనాలకు మదనపల్లి ఆర్టీఓ కార్యాలయంలోనే యదావిధిగా ఎఫ్.సి సేవలు కొనసాగించాలని,ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడే చర్యలు ప్రభుత్వం మానుకోవాలని, తక్షణమే జిల్లాలోని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి స్పందించి మదనపల్లి ఆర్టీఓ కార్యాలయంలో ఎఫ్.సి సేవలు అందించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ముబారక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్ప డిమాండ్ చేశారు. సోమవారం మదనపల్లి ఆర్టీఓ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో రిజిస్ట్రేషన్ అడ్రస్ నుంచి 60కిలో మీటర్ల నడపాలని నిబంధనలు ఉన్నా మదనపల్లి, రామ సముద్రం నుంచి రాయచోటి 80 కిలోమీటర్ల దూరం ఉండటంతో ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే ఎలాంటి ఇన్సూరెన్స్ ఇచర ప్రమాద భీమా సౌకర్యం ఉండదని తెలిపారు.రాయచోటి ఎఫ్ .సి.చేయడానికి చిన్నపాటి సమస్యలు ఎదురైనా తిరిగి మదనపల్లి పోయి సరిచేసుకొని మరుసటి రోజు తిరిగి రాయచోటి పోవడానికి ఆటో వర్కర్లు, యజమానులు అనేక ఇబ్బందులు, ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మిక ప్రయోజనాలు కోసం కాకుండా కార్పొరేట్ ప్రైవేటు శక్తుల ప్రయోజనాలు కోసం పరిపాలన చేస్తున్నదని విమర్శించారు . జిల్లాలోని మదనపల్లి,ఇతర శాసనసభ్యులు, జిల్లా మంత్రి రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తక్షణమే స్పందించి రాష్ట్రంలోని రవాణా శాఖ అధికారులతో సంప్రదింపులు చేసి మదనపల్లి ఆర్టీఓ కార్యాలయంలోనే యదావిధిగా ఎఫ్.సి సేవలు కొనసాగించేవిదంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆటో వర్కర్లను సమీకరణ చేసి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, ఏఐటీయూసీ మదనపల్లి నియోజకవర్గ అధ్యక్షులు రెడ్డప్ప, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మస్తాన్,గంగులప్ప,కరీముల్లా, మహబూబ్ భాషా,చందు, బాలు, వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు

పరిశ్రమలతోనే ఉపాధి

మదనపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ భాష

విశాలాంధ్ర -రామసముద్రం: పరిశ్రమల తోనే ఉపాధి లభిస్తుందని మదనపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ భాష తెలిపారు సోమవారం మండల కేంద్రమైన రామసముద్రం పంచాయతీ గుంతల పేట వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన ఎస్ఎల్ విపి స్పిన్ పైపుల పరిశ్రమను ప్రారంభించారు పరిశ్రమను ఏర్పాటు చేసిన గౌని వారి శ్రీనివాస్ గౌడ్ ను అభినందించారు పైపుల పరిశ్రమ ద్వారా కొన్ని కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. పైపుల పరిశ్రమ వల్ల చాలామంది కి ఉపయోగకరం ఉంటుందని చెప్పారు. పరిశ్రమ యజమాని గౌని వారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం మెరుగైన రాయితీలు ఇస్తే మండల కేంద్రం పరిసరాలలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మరి కొంతమంది ముందుకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. 9986087369 ఫోన్ నెంబర్ కు పైపులు కావలసినవారు సంప్రదించాలని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్ భాష స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు కార్యకర్తలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఽ నెలరోజుల క్రితం ఎలా నెల్లూరు పంచాయతీ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చంద్రప్ప అనారోగ్యంతో మృతి చెందాడు మృతుని కుటుంబాన్ని పరామర్శించి పార్టీ అన్ని రకాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గౌను వారి విజయ్ కుమార్ గౌడ్ రాటకొండ మధుబాబు కృష్ణంరాజు యాదవ్ కొండూరు నారాయణరెడ్డి రాజేష్ ప్రశాంత్ రెడ్డి రూపేష్ రెడ్డి తిప్పన్న వెంకటస్వామి రామ్మూర్తి వికాస్ తదితరులు పాల్గొన్నారు.

31వ వార్డులో తొలి అడుగు కార్యక్రమం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ఇంటింటికి సుపరిపాలనలో భాగంగా 31వ వార్డు ఇన్‌చార్జ్, సీనియర్ తెదేపా నాయకులు మార్తల గురివిరెడ్డి టీమ్ ఆధ్వర్యంలో 123, 124, 175, 186, 187, 188 బూత్‌లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గురివిరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు మెచ్చుకోవడమే కాకుండా రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డిలు ప్రొద్దుటూరు అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వద్దిరెడ్డి మునిరెడ్డి, మార్తల మునిరెడ్డి, బోగాల వెంకటరామిరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సేవా సంఘం సహకారంతో అన్నదానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక శ్రీ అగస్త్యేశ్వరాలయంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే అన్న ప్రసాద సేవలో భాగంగా సోమవారం నాడు రెడ్డి సేవా సంఘం సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 500మంది ప్రజలు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షులు, రెడ్డి సేవా సంఘం ఉపాధ్యక్షులు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సేవా సభ్యులు చేసే సేవా కార్యక్రమాలతో పాటు ప్రతి నెల 4వ సోమవారం శివోహం అన్న ప్రసాద సేవలో భాగస్వామ్యం కానున్నారని తెలిపారు. వారి సేవా నిరతిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శివోహం కమిటీ ఉపాధ్యక్షులు మురుకూటి సూర్యనారాయణ, సభ్యులు శిష్టు నారాయణ, లింగారెడ్డి, రెడ్డి సేవా సంఘం సభ్యులు వెంకటేశ్వర రెడ్డి, కాశీ ప్రసాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వరదను కలిసిన మాదాసు మురళీ

విశాలాంధ్ర -ప్రొద్దుటూరు: ఇటీవల గుండెకు ఆపరేషన్ చేయించుకొని వచ్చిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డిని రాధా నగర్‌లోని ఆయన స్వగృహంలో జనసేన పార్టీ నాయకులు మాదాసు మురళీ కలిసి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి విలువలతో కూడిన రాజకీయం చేసే గొప్ప వ్యక్తి అని, పేదల పక్షపాతి అయిన వరదరాజుల రెడ్డి త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్య వంతముగా ఉండాలని, నియోజకవర్గంలోని ప్రజలకు ఆయన మరిన్ని సేవలు అందించ చాలని ఆకాంక్షిస్తున్నట్లు మాదాసు మురళీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు హరీష్, కేశవ్, నాగరాజు తదితరులు కలిశారు.

సిద్ధారెడ్డిగారిపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు

విశాలాంధ్ర -సుండుపల్లె : గ్రామ పంచాయతీ సిద్ధారెడ్డి గారిపల్లెతో పాటు ఈడిగపల్లె, గుట్టకిందరాచపల్లెలో సోమవారం సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా సంక్షేమం, అభివృద్ధిని తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో రమణ పణీలు ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి :ఏఐటియుసి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని ఏఐటియుసి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మాదిరాజు గంగాధర్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహశీల్దార్ కె అమర్ నాథ్ కు భవన నిర్మాణ కార్మికులు అందరూ వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ కోర్టు తీర్పులు భవన నిర్మాణ కార్మికులకు అనుకూలంగా వచ్చినా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వ పథకాలతో సంబంధం లేకుండా వెల్ఫేర్ బోర్డు ద్వారా స్కీంలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న క్లెయిమ్ లను తక్షణం స్పందించి మంజూరు చేయాలని కోరారు.పోరాటాల ద్వారా భవన నిర్మాణ కార్మికుల హక్కులను సాదించుకుందామని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ వెల్ఫేర్ బోర్డు నిదులను కార్మికుల ప్రయోజనాలకే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు పాండురంగయ్య, కార్యదర్శి మల్లిఖార్జున, నరసింహులు, భాస్కర్, హరిబాబు, సిహెచ్ హేమంత్,గోపి తహశీల్దార్ కు వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.

వైవియూలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-కడప వైవీయూ : యోగి వేమన యూనివర్సిటీ పీజీ కళాశాలలోని ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ విభాగానికి గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం ఈ నెల 31వ తేదీ ఉదయం 10.00 గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తెలిపారు. మైక్రోబయాలజీలో పిహెచ్‌డి, నెట్/ స్లెట్ అర్హత కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. అర్హత ప్రమాణాలు ఉన్న ఆసక్తిగల అభ్యర్థులు బయో-డేటా అలానే సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా ప్రిన్సిపల్ కార్యాలయంలో జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఒక పోస్టు మాత్రమే ఖాళీ ఉందన్నారు. వివరాలకు వైవీయూ డాట్ ఈడీయు డాట్ ఇన్ వెబ్సైటును సందర్శించాలని ప్రిన్సిపల్ సూచించారు.

క్రీడాకారిణి శివానికి కృత్రిమ చెయ్యి అమరిక

విశాలాంధ్ర-రాయచోటి: జన్మతః కుడి చేయి లేకుండా జన్మించిన జవహర్ నవోదయ విద్యాలయ సమితి, మదనపల్లి ఇంటర్మీడియట్ విద్యార్థిని కుమారి హెచ్.శివాని, పారా అథ్లెటిక్ క్రీడాకారిణికి కృత్రిమ కుడి చెయ్యి అమర్చినట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అభినందనీయమైన మానవీయమైన చర్యకు శ్రీకారం చుట్టారు. జన్మతః కుడి చేయి లేకుండా జన్మించిన జవహర్ నవోదయ విద్యాలయ సమితి, మదనపల్లి ఇంటర్మీడియట్ విద్యార్థిని కుమారి హెచ్.శివాని పారా అథ్లెటిక్ క్రీడాకారిణికి కృత్రిమ కుడి చెయ్యి అమరిక ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఈమె దివ్యాంగుల కేటగిరీ పోటీలలో షాట్‌పుట్, జావెలిన్ త్రోలలో జాతీయ స్థాయి పారా అథ్లెట్ గా, థాయిలాండ్, బెంగళూరు, గుజరాత్ వంటి దేశీయ-అంతర్జాతీయ వేదికలపై పోటీపడి మూడు బంగారు పతకాలు సాధించి గర్వించదగిన క్రీడాకారిణి అన్నారు. కృత్రిమ చేయి ఏర్పాటు కొరకు జిల్లా కలెక్టర్ ను అభ్యర్థించగా వెంటనే స్పందించి రూ.21,000 మంజూరు చేయగా, డిస్ట్రిక్ట్ డిసెబిలిటి రిహాబిలిటేషన్ సెంటర్ (డీడీఆర్‌సీ), కడప, దాని అమలు సంస్థ దర్శిని హ్యాండిక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా రూ.39,000తో అదనపు సహకారం అందించారన్నారు.

త్వరలో పార్టీని వీడుతున్నాను

ఆత్మీయ సమావేశంలో ఎంపీపీ

విశాలాంధ్ర -బ్రహ్మంగారిమఠం : తెలుగుదేశం పార్టీ అభివృద్ధి పనులను చూసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కొంతకాలం నుండి దూరంగా ఉంటూ మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆయన చేస్తే అభివృద్ధి పనులను చూసే పార్టీని తెలుగుదేశం పార్టీలో చేరేందుకు కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అందులో భాగంగానే ఆయన అనుచరులు వర్గాలతో కలిసి ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని తను 42 సంవత్సరాల నుండి మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి నడిచానని ఆయన ఎప్పుడూ మండలాన్ని అభివృద్ధి చేయలేదని బ్రహ్మంగారిమఠం మండలం తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ తన సొంత మండలం కావడంతో ఆయన చేసిన అభివృద్ధిని చూసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీ చేరేందుకు కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు వీరనారాయణరెడ్డి ఆత్మీయ సమావేశంలో తెలిపారు ఈ సమావేశం ఉద్దేశించి వారు మాట్లాడుతూ తను మండల ప్రజా పరిషత్ అధ్యక్షులుగా ప్రజలు ఎంపీటీసీలు కార్యకర్తలు ఎన్నుకోవడం జరిగిందని అందులో భాగంగానే తను అభివృద్ధి కోరుకుంటూ పార్టీని వీడుతున్నానని కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి అందరి నిర్ణయాలు తీసుకొని తెలుగుదేశం పార్టీ చేరుతున్నానని ఆయన తెలిపారు. త్వరలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీ చేరుతున్నానని ఈ సమావేశానికి వచ్చిన తన అభిమానులు కార్యకర్తలు నాయకులకు ప్రజాప్రతినిధులకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సహకార పరపతి సంఘం చైర్మన్, చిలేకాం పల్లె నాగేశ్వర్ రెడ్డి, సహకార పరపతి సంఘం డైరెక్టర్, ఉపాధ్యక్షురాలు భర్త కోనపులి రాజా నాయుడు, మండల ఉపాధ్యక్షురాలు, మొరతోటి లలితమ్మ, తోట్లపల్లి ఎంపిటిసి భర్త, ఓబుల్ రెడ్డి, ఎంపిటిసి మనోహర్ ఆచారి, సర్పంచులు, చెన్న కృష్ణారెడ్డి, సర్పంచ్ తండ్రి రామ సుబ్బారెడ్డి, సోమిరెడ్డి పల్లె సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, సిద్ధ సిద్ధారెడ్డి, శేషారెడ్డి, యల్లటూరి మల్లికార్జునరెడ్డి, సిద్ధారెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు లెక్కల నారాయణరెడ్డి, ఏదో పంచాయతీ నుండి వచ్చిన కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం, దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక శ్రీ వేజా నర్సింగ్ హోమ్ 25సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంధర్భంగా పేదలకు, ఆసుపత్రికి విచ్చేసిన రోగులకు డాక్టర్ పి.సువర్ణ, కుటుంబ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా మహిళలకు చీరలను, మగవారికి పంచే, టవాలు అందజేశారు. సుమారు 300మందికి అన్నదానాన్ని నిర్వహించడంతో పాటు చీరలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నీతిమాలిన చర్యలు ఇకనైనా మానుకోండి

టిడిపి నేతలకు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ హెచ్చరిక

విశాలాంధ్ర - పులివెందుల : టిడిపి నేతలూ ఇవిగో నా సమాధానాలు అంటూ నీతిమాలిన చర్యలు రాజకీయాలు మానుకుంటే మంచిదని ఆయన హితవు పలికారు. సోమవారం హజ్ కమిటీ మెంబర్ మహబూబ్ బాషా విలేకరులతో మాట్లాడుతూ నాపై కొన్ని ఆరోపణలు చేశారని, ఆరోపణలుకు నా సమాధానాలు ఇవిగో.. అంటూ చైర్మన్ వరప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ 2016లో ఆదినారాయణ రెడ్డిని ఆర్ అండ్ బి లో కలవడం వాస్తవమేనని అయితే ఆనాడు వడ్డెర సంఘం తరఫున లోన్ల విషయమై కలవడం జరిగిందన్నారు. ఆయన కలవడానికి కూడా తొండూరు మండల మల్లికార్జునరెడ్డి ఆదినారాయణ రెడ్డిదగ్గరికి తీసుకుపోవడం జరిగిందని చెప్పారు. నాకు ఆదినారాయణ రెడ్డి ఎవరో తెలియదని మల్లికార్జునరెడ్డి కూడ మీ టీడీపీ నాయకుడు కాబట్టి ఆయన నన్ను ప్రేరేపించడంతోనే వెళ్లానని అది కూడా వడ్డెర సంఘం వారికి లోన్లు ఇప్పిస్తాము అంటే వెళ్లానని చెప్పుకొచ్చారు. నేను బీటెక్ రవిని సహాయం కోరానని అది కూడా మా బంధువులకు బాగలేదని బీటెక్ రవిని అడిగినట్లు టిడిపి నాయకులు చెప్తున్నారు. వారికి ఒకటే సవాలు విసురుతున్న నేను ఎవరిని సహాయం అడిగాను నిరూపిస్తే నేను రాజకీయ సన్యాసం తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఇంకొక నిందారోపణ చేశారు టిడిపి నేతలు నేను వైఎస్ వివేకానంద రెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించడానికి ప్రయత్నించానని ఓటు వేయలేదని చెబుతున్నారు. నేను ఒక్కటే చెబుతున్న ఒక అబ్బకు పుట్టిన వాడిగా చెబుతున్న నేను వివేకానంద రెడ్డికే ఓటు వేశాను. బీటెక్ రవి నన్ను మభ్య పెట్టడానికి తొండూరు మల్లికార్జున రెడ్డి ని నా దగ్గరికి పంపించి 25 లక్షలు డబ్బు డైరెక్టర్ పదవి గన్మెన్లు ఇస్తానన్న నేను లొంగలేదని చెప్పారు. వారు ఎంత మభ్యపెట్టిన నేను లొంగలేదని నా ఆత్మ సాక్షిగా వివేకానంద రెడ్డికి ఓటు వేశానని ఆయన చెప్పారు. నేను వైయస్ కుటుంబీకులకు సిన్సియర్ కార్యకర్తగా ఉన్నానని దీనికి నేను గర్వపడుతున్నానన్నారు. దీనిపై ఎక్కడికైనా నేను ప్రమాణం చేసేందుకు సిద్ధమని చెప్పారు. షేక్ మహబూబ్ బాషా కు ఒక్కటే సవాల్ విసురు తున్నానని మీ బీటెక్ రవి ఎప్పుడైనా నాకు ఫోన్ చేసి మాట్లాడినట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని చెప్పారు. సమయం సందర్భం వచ్చినప్పుడు మీ జాతకాలన్ని బయటపెట్టే రోజులు దగ్గర్లో ఉన్నాయన్నారు. మున్సిపల్ ఎలక్షన్లలో మాకు కోవర్టులుగా మీ వాళ్ళు ఎవరెవరు పని చేశారో ఆ నాయకుల బాగోతాన్ని బయటపెట్టే సందర్భం వస్తుందని హెచ్చరించారు. నన్ను మీ పార్టీలోకి రావడానికి నాకు రెండు కోట్ల డబ్బు ఆశ చూపించారని అయినను నేను లొంగలేదని నేను ఎప్పటికైనా వైయస్ కుటుంబీకుల విధేయుడునని అని చెప్పుకొచ్చారు. టిడిపి నేతలకు ఒక్కటే సవాల్ విసురుతున్న మా బంధువుల కోసం మీతో నేను సహాయం అడిగినట్లు డబ్బు తీసుకున్నట్టు ఎవరైనా నిరూపిస్తే నేను శాశ్వతంగా రాజకీయాలనుంచి తప్పుకుంటానన్నారు. బీటెక్ రవికి ఒకటే సవాల్ విసురుతున్నానని నాపై ఎన్ని కేసులు పెట్టినా ఎన్ని బురదజల్లే మాటలు మాట్లాడించిన భయపడే ప్రశ్న లేదన్నారు. అవినాష్ రెడ్డితో నాకు రెండు కోట్లు నష్టపోయానని నీవు చెబుతున్నావు దమ్ముంటే నీవు ఎవరితో చెప్పావో నిరూపించు. వారెవరో తప్పకుండా చెప్పాలని హెచ్చరించారు. అవినాష్ రెడ్డి నాకు ఇచ్చే విలువ ఏమిటో నాకు తెలుసునని ఆయన ఎంతో నాకు వర్కు ఇచ్చి సహాయం చేశాడని, నాకు వచ్చిన డబ్బులో కరోనాలో కూడా నేను ఎంతోమందికి సహాయం చేశానని అది అందరికీ తెలుసునని అన్నారు. మీకు దమ్ముంటే మీరే మగవాళ్ళు అయితే నేను అవినీతి చేసినట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధం అని అన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి

ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ

విశాలాంధ్ర-కడప రూరల్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునః ప్రారంభించాలని పోస్ట్ కార్డ్‌లు పంపించడం జరిగింది. సోమవారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో పెండింగ్ లో ఉన్న 46 వేల క్లైములకు నిధులు మంజూరు చేయాలని. నిర్మాణ సంక్షేమ బోర్డును పునః ప్రారంభించాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర డిప్యూటీ సెక్రెటరీ ఉద్దె. మద్దిలేటి. జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న డిమాండ్ చేశారు. ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో కడప నగరంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, గౌరవ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి, భవన నిర్మాణ కార్మిక సమస్యలను పరిష్కరించాలని పోస్ట్ కార్డ్ ద్వారా పంపించడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ ఉద్దె. మద్దిలేటి. జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న. మాట్లాడుతూ. భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు అనేక సమస్యలతో జీవితాలు గడుపుతున్నారు. పని భద్రత, ఆరోగ్య భద్రత, ఆహార భద్రత లేక దుర్భరమైన జీవితాలు సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునః ప్రారంభిస్తామని మేనిఫెస్టోలో పెట్టటం జరిగినది, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డును పునః ప్రారంభిస్తారని ఆశతో కార్మికులందరూ ఓటు అనే ఆయుధంతో గత ప్రభుత్వాన్ని కిందకు బంపి కూటమి ప్రభుత్వాన్ని గద్దెనెక్కించటం జరిగినది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నప్పటికీ సంక్షేమ బోర్డు అమలు చేయకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు మల్లికార్జున, ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప నగర నాయకులు నరసింహులు, భాషా, బుజ్జి, మస్తాన్, బ్రహ్మయ్య, మహేష్ ,నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

జీఓ నెం.1214ను రద్దు చేసి

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: జీఓ నెంబర్ 1214ను రద్దు చేసి భవణ నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్‌లో ఉన్న క్లైములను పరిష్కారం జరిగే విధమైన చర్యలు చేపట్టి ఆంధ్రప్రదేష్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపి కార్మికులను ఆదుకోవాలని భవణ నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పి.చిన్న ఓబన్న(యేసోబు) తహసీల్దార్‌కు పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భవణ నిర్మాణ సంక్షేమ చట్టం 1996ను 2006 సంవత్సరం నుండి మన రాష్ట్రంలో అమలులోకి తెచ్చి గత ప్రభుత్వాలు భవణ నిర్మాణ కార్మికులకు 12రకాల సౌకర్యాలు కల్పించి లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా క్లైములు పరిష్కారం చేసి కార్మికుల జీవితాలలో వెలుగులు నింపారని, కానీ 2019 సంవత్సరంలో జగన్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేస్తూ జీఓ నెం.1214ను ప్రవేశపెట్టి కార్మికులకు అన్యాయంగా నిధులు ప్రభుత్వ అవసరాలకు వాడుకొని సుమారు 46వేల క్లైములకు నిధులు మంజూరు చేయకపోవడం వలన కార్మికులు అనేక అర్ధిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అంతేకాకుండా ఒసుక కొత్త పాలసీ తెచ్చి సరఫరా నిలిపివేయడం వలన 32మంది కార్మికులు అసులుబాచారని తెలిపారు. దానికి తోడు ఇసుక రేటు సామాన్యులకు అందుబాటులో లేకపోవడం వలన చేతి నిండా పని లేక సంవత్సరాల పాటు కార్మికులు అర్ధాకలితో అలమటించడం జరిగిందని ఆ సమయంలో కార్మికుల బాధలను తెలుసుకున్న కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో సంక్షేమ బోర్డును పునరుద్ధరించి ఆదుకుంటామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి గెలిచిన తర్వాత ఇసుక ఉచితంగా ఇవ్వడం పట్ల మా సంఘం హర్శం వ్యక్తం తెలియజేస్తుందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న 46వేల క్లైములను పరిష్కరించి నిధులు మంజూరు చేయాలని, ప్రభుత్వ పథకాలతో సంబంధం లేకుండా 1996చట్టం అమలు చేసి 12రకాల సౌకర్యాలను అందించాలని, సంక్షేమ బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, లేబర్ కార్యాలయంలో ఉన్న ఖాళీలను భర్తి చేసి సిబ్బంది కొరత లేకుండా చూడాలని, కొత్త గుర్తింపు కార్డులు ఇచ్చి పాత కార్డులను రెన్యువల్ చేయాలని, భవణ నిర్మాణ కార్మిక సంఘాలతో వెంటనే మీటింగ్ ఏర్పాటుచేసి కార్మికుల సమస్యలు తెలుసుకోవాలని, 1996 చట్టం ప్రకారం 50సంవత్సరములు నిండిన భవణ నిర్మాణకార్మికులకు 6వేల పెన్శన్ మంజూరు చేయాలని, గత ప్రభుత్వం బోర్డు నుండి వాడుకున్న నిధులను తిరిగి బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేస్త్రీలు సాంబయ్య, ప్రసాద్ రావు, మత్తయ్య పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు

విశాలాంధ్ర-నందలూరు: మండలంలో నాగుల చవితి వేడుకలను సోమవారం మహిళలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే పుట్ల వద్దకు చేరుకొని భక్తిశ్రద్ధలతో పుట్టకు పాలు పోసి, మొలక వచ్చిన సొద్దలు, నూగుపిండి, సలిపిండిని నైవేద్యంగా సమర్పించారు. మండలంలోని నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో, అరవపల్లిలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో, ఎన్టీఆర్ నగర్ లోని పుట్టల వద్ద మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

5న చలో కడప విద్యుత్ భవన్

- విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి
- కడప ఐటిఐ సర్కిల్లో సంతకాల సేకరించిన ప్రజా సంఘాల నాయకులు

విశాలాంధ్ర-కడప రూరల్: స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని పెంచిన ఇంధన సర్దుబాటు చార్జీలు ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం కడప ఐటిఐ సర్కిల్ నందు సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు మనోహర్ మద్దిలేటి సుబ్బరాయుడు రమణయ్య దస్తగిరిరెడ్డి తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులకు కత్తెరవేసే టైం ఆఫ్ డే టార్ఫ్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమ

లు చేస్తామని ప్రకటించడం దారుణమని వారు తీవ్రంగా విమర్శించారు. రోజు వారీ డిమాండ్ ను బట్టి చార్జీలు విధించే ఈ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయడానికి ఈఆర్సి అనుమతించడం దారుణమని ఆయన అన్నారు. సోలార్ విద్యుత్తు యూనిట్ 1.99 కి టెండర్లు పడిన రోజుల్లో సెకీతో 2.49 రూపాయలకి కొంటామని ఒప్పందం చేసుకోవడం సరైనది కాదన్నారు. సెకీతో ఒప్పందం చేసుకోవడాన్ని తొలి నుండి వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. సెకితో ఒప్పందం వల్ల 25 ఏళ్ల పాటు రాష్ట్ర ప్రజలు లక్ష కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని ఇది మోయలేని భారం అవుతుందని వారు అన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల అమర్చే కాంట్రాక్టు అదానికి కట్టబెట్టారని ఆయన విమర్శించారు. అదాని కంపెనీ 59, 21, 344 మీటర్లను బిగించాల్సి ఉందన్నారు. ఈ విధానాన్ని అనుమతించొద్దని వారి కోరారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు శ్రీనివాసులు రెడ్డి రామ్మోహన్ చంద్రారెడ్డి వెంకటసుబ్బయ్య మల్లికార్జునతో పాటు స్థానిక ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

దాడిలో గాయపడిన బాధితులకు పరామర్శ

విశాలాంధ్ర-తొండూరు: తొండూరు మండలం ఇనగలూరు గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తులు ఇటీవల జరిగిన ఓ దాడి సంఘటనలో గాయపడిన సమరసింహారెడ్డి, హరి కిషోర్‌రెడ్డిలను తుంగభద్ర హైలెవల్ కెనాల్ కమిటీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పరామర్శించారు. అనంతపురం కిమ్స్ సవేరా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న వారిని సోమవారం పరామర్శించారు. పరిస్థితి ఏ విధంగా ఉంది అని తండ్రి మూరం రెడ్డి బాల ఓబుల్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

విశాలాంధ్ర-కలికిరి: ఎస్.డబ్ల్యూ.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ, కళాశాల, కలికిరి యందు సోమవారం నుండి B. Com జనరల్, B.Com కంప్యూటర్ అప్లికేషన్స్, B.Sc కంప్యూటర్ సైన్స్, B.Sc బోటనీ కోర్సులకు offline అడ్మిషన్ అప్లికేషన్స్ కళాశాలలో అందుబాటులో ఉందని, ఇంటర్మీడియట్ పూర్తి అయిన బాలికలు apply చేసుకోవాలని, కళాశాల ప్రధానాచార్యులు డా. ఎల్.అంజలీ దేవి తెలిపారు.

ప్రకృతిని కాపాడుకుందాం

విశాలాంధ్ర-వేంపల్లి: ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పారిశ్రామిక, శాస్త్ర, సాంకేతిక విప్లవముల ఆధారంగా అంతరించిపోతున్న మన సహజ వనరులను కాపాడుకోవడానికి, ఉత్తమ పద్ధతులను గురించి అవగాహన పెంచటానికి, ప్రతి సంవత్సరం ప్రకృతి పరిరక్షణ దినోత్సవంను జరుపుకుంటామని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్ రెడ్డి తెలియ చేశారు. కళాశాలలో వృక్షశాస్త్ర విభాగాధిపతిగా పనిచేయుచున్న డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి ప్రకృతి యొక్క సార్వభౌమత్వాన్ని ఫలితంగా మానవాళికి జరిగే మేలులను వివరిస్తూ ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యతను, విభిన్న ఉదాహరణల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లేశ్వరమ్మ విద్యార్థుల చేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞను చేయించారు. డాక్టర్ నాగలక్ష్మి దేవి, ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా సమితి సభ్యురాలిగా బొంత విజయమ్మ

విశాలాంధ్ర-బద్వేలు: బద్వేలులో జరిగిన కడప జిల్లా సిపిఐ మహాసభలులో జిల్లా సమితి సభ్యురాలుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి కామ్రేడ్ విజయ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సిపిఐ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని మహిళా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పాటుపడతానని ఎక్కడ మహిళలపై అఘాయిత్యాలో జరిగిన ముందుండి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతానని ఆమె పేర్కొన్నారు.

పరస్పర విమర్శలు మానండి - అభివృద్ధికి తోడ్పడండి

- వైసిపి, టీడిపిలకు కాంగ్రెస్ ఇన్‌చార్జి ధ్రువ సూచన

విశాలాంధ్ర-పులివెందుల: వైకాపా నాయకులు, టిడిపి నాయకులు, విమర్శలు ప్రతి విమర్శలు చేసుకోవడం మానుకొని పులివెందుల అభివృద్ధికి తోడ్పడాలని కాంగ్రెస్ పులివెందుల నియోజకవర్గం ఇంచార్జ్ ధ్రువ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి లన్నారు. సోమవారం కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైకాపా టీడీపీ నాయకులు ప్రజలను భయభ్రాంతులను చేసే విధంగా విమర్శలు ప్రతి విమర్శలు చేసుకుంటున్నారని, పులివెందుల ప్రాంత ప్రజలు ఫ్యాక్షనిజాన్ని మానేసి ఆనందంగా ఉన్నారన్నారు. అలాంటి పులివెందుల ప్రాంతంలో మళ్ళీ ఫ్యాక్షను మొదలుపెట్టే విధంగా విమర్శలు ప్రతి విమర్శలు చేయడం చాలా బాధాకరమన్నారు. పులివెందుల ప్రాంతంలో

ఫ్యాక్షనిజం రాజారెడ్డితోనే అంతమైందన్నారు. కన్న తండ్రిని చంపినా కూడా దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి పులివెందుల ప్రాంత ప్రజలు ఫ్యాక్షన్‌ను వీడి సంతోషంగా ఉండాలని ఆయన సిద్ధాంతం అన్నారు. పులివెందుల అభివృద్ధి పైన ఇరు పార్టీ నాయకులు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు ఖాదర్, బిసి సెల్ పులివెందుల నియోజకవర్గ అధ్యక్షులు నాగరాజు, సాయి, వినయ్, అక్షిత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాపాడుకుందాం: ఏఐటియుసి

విశాలాంధ్ర-వేంపల్లి: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న కార్మిక ద్రోహాన్ని తిప్పి కొట్టి, లేబర్ కోడ్స్‌ను పెంచిన పది గంటల పని విధానం కార్మిక హక్కులపై హరించే విధంగా ఉన్నాయని రక్షించుకునేందుకు జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి బాదుల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బళ్లారపు రామాంజనేయులు పిలుపు నిచ్చారు. శనివారం వేంపల్లి పట్టణంలో సార్వత్రిక సమ్మె సంబంధించిన కరపత్రాలు విడుదల చేసి వారు మాట్లాడుతూ కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా బిజెపి మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని ఆ మార్పుల

ను వెంటనే ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించిన 29చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా పెట్టుబడి దారులకు అనుకూలంగా మార్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి బాలాజీ ఉపాధ్యక్షులు చలపతి కోశాధికారి బుజ్జి నాయకులు బాబావలి ఆర్కే వ్యాలీ సెక్యూరిటీ యూనియన్ నాయకులు ప్రసాద్ మల్లేష్‌లు పాల్గొన్నారు.

సీఎం గారూ! ఏనుగుల బారి నుండి రక్షించండి

- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: గత కొంత కాలంగా ఏనుగుల దాడులు ఎక్కువయ్యాయని, వీటి బారి నుండి ప్రజలను, ప్రత్యేకించి రైతులను కాపాడాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి కూటమి ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశారు. సోమవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆహా రం, నీటి కొరత, గుంపుల మధ్య పోరాటం తదితర కారణాల వల్ల ఏనుగులు అడవులు వదిలి సమీపంలోని గ్రామాల్లోకి వచ్చి పంట పొలాలను తిని, త్రొక్కి నాశనం చేయడమే కాకుండా రైతులను తొక్కి చంపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2025 జనవరి 18న చంద్రగిరి మండలం,కందులవారి పల్లె ఉప సర్పంచ్, టిడిపి నాయకులు రమేష్ చౌదరిని ఏనుగులు తొక్కి చంపాయి. 2025 ఏప్రిల్ 25న చిన్న గొట్టి గళ్ళు మండలం చిట్టేచర్ల గ్రామానికి చెందిన సిద్దయ్యను తొక్కి చంపాయి. ఈ నెల 26వ తేదీ శనివారం చిత్తూరు జిల్లా, సోమల మండలం, దిగువ కొత్తూరు గ్రామానికి చెందిన రామకృష్ణ రాజు అనే రైతును పొలం వద్ద ఏనుగులు తొక్కి చంపాయి. చిత్తూరు, అన్నమయ్య, విజయనగరం జిల్లాలలో ఏనుగుల దాడులు ఎక్కువయ్యాయి. ఇటీవలి కాలంలోనే దాదాపు 30మంది చనిపోయారు. 300 ఎకరాలలో పంట ధ్వంసమైంది. రైతులకు కంటి మీద కునుకు లేదు. కర్నాటకకు పోయి పవన్ కల్యాణ్ తెచ్చిన కుంకీ ఏనుగులు ఏమయ్యాయో తెలియడం లేదు. స్వర్ణాంధ్ర, వికసిత ఆంధ్ర సంగతి దేవుడెరుగు, ముందు ఏనుగుల బారి నుండి రైతులను,ప్రజలను కాపాడాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మోడీ ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి సెయిల్ ఆధ్వర్యం లోకడప జిల్లా లో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేయాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి కల్పించడం మా ధ్యేయం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: మహిళలు ఆర్థికంగా స్వయం సంబరంగా మారి, తమ జీవితాన్ని స్వతంత్రంగా నడిపించుకుంటే తమకు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాబార్డ్ జీఎం బి. విజయ విహారి అన్నారు. కడప స్థానిక బాలాజీ నగర్ ఐటిఐ సర్కిల్ యూత్ హాస్టల్ నందు వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుపని శిక్షణ శిబిరాన్ని రిబ్బన్ కటింగ్ చేసే ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలకు స్వయం ఉపాధిని కల్పించాలని సంకల్పించిన వికసిత ఫౌండేషన్ కి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మరో అతిథిగా విచ్చేసిన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓబులేసు మాట్లాడుతూ మహిళలు ఎవరిపైన ఆధారపడకుండా స్వయం ఉపాధి మార్గంలో ముందుకు సాగేందుకు ఈ శిక్షణ ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. ఈ

కార్యక్రమం నిర్వాహకులు వికసిత ఫౌండేషన్ చైర్మన్ శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ మహిళలు తాము కాళ్ళ మీద తాము నిలబడడం వల్ల మహిళా సాధికారత ముందంకెళ్తుందని ఈ విధంగా మహిళలు తాము నైపుణ్యంతో విద్యను అభ్యసించడం ద్వారా మెరుగైన సమాజాన్ని తీర్చిదిద్దుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కుట్టు శిక్షణ ఉపాధ్యాయురాలు మౌనిక, జేబీఎస్ అశోక్, వికసిత ఫౌండేషన్ సభ్యులు సుబ్బయ్య, రేవంత్, మల్లికార్జున, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట మోసం

- కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి
- బాధితుల ఆవేదన

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: బద్వేల్‌కు చెందిన కానిస్టేబుల్ రవికుమార్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ మా వద్ద నుండి దాదాపు పది లక్షలు తీసుకొని ఉద్యోగం ఇవ్వకుండా మీకు చేతనైన పని చేసుకోండి డబ్బులు ఇవ్వనంటూ మొండికేస్తున్నారని బద్వేల్ కు చెందిన వెంకటరత్నమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నగరంలోని వైఎస్సార్ ప్రెస్ క్లబ్ ల ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ. నా కూతురుకు ఉద్యోగం ఇప్పిస్తానంటూ మా వద్ద ఆరు లక్షలు తీసుకున్నాడని తీసుకున్న తర్వాత కంప్యూటర్ ఆపరేటర్ ఇప్పిస్తానంటూ స్వీపర్ ఉద్యోగం ఇచ్చాడని మాకు ఈ ఉద్యోగం వద్దు మా డబ్బులు మాకు ఇవ్వండి అంటూ అడిగితే నీ చేతనైంది చేసుకో పోలీసులను బెదిరిస్తావా అంటూ ఎదురు తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు లక్షలు కాకుండా అప్పుగా కూడా మా వద్ద డబ్బులు తీసుకుని ఒంటరి మహిళనైనా నన్ను ఇవ్వకుండా వేధిస్తున్నాడని తెలిపారు. పలుమార్లు పోలీస్ స్టేషన్కు వెళ్లి కలిసినప్పటికీ పోలీసులు న్యాయం చేయలేదని అపోయారు. జిల్లా ఎస్పీని, కలెక్టర్ ను గ్రీవెన్స్ లో కలిసినప్పటికీ ఫలితం లేదని మీడియా ముందుకు వచ్చానని మీ ద్వారా నాకు న్యాయం చేయాలని ఆమె తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-పెద్దమండ్యం: మండలంలోని 17 పంచాయతీలకు కార్యదర్శులు బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో శ్రీధర్ రావు పేర్కొన్నారు. అవికే నాయక్ తాండ పంచాయతీ కార్యదర్శిగా సురేష్ రెడ్డి, బండమీదిపల్లి, మహమ్మద్, బండ్రేవు సద్దాం హుస్సేన్, సి గొల్లపల్లి మంజు భార్గవి, దిగువపల్లి భూపతి, గుర్రం వాండ్లపల్లి జగన్మోహన్, కలిచర్ల గిరీష్ యాదవ్, కోటకాడ పల్లి జనార్దన్, మండల వాండ్లపల్లి బాలాజీ, ముసలి కుంట శ్రీకాంత్ రెడ్డి, ఎన్ఓపల్లి శైలజ, పాపేపల్లి గోవర్ధన్ రెడ్డి, పెద్దమండ్యం, సిద్దవరం సుబ్రహ్మణ్యం, రామా నాయక్ తాండ ప్రసన్నలక్ష్మి, శివపురం పద్మనాభం, వెలుగల్లు ఖాదర్ బాషా బాధ్యతలు చేపట్టారు. పంచాయతీలలో తాగునీటి సమస్య, పారిశుద్ధ్యంపై నిఘా పెట్టాలని ఎంపీడీవో శ్రీధర్ రావు కార్యదర్శులు ఆదేశించారు.

గండికోటను సందర్శించిన లంకా దినకర్

విశాలాంధ్ర-యర్రగుంట్ల : కడప జిల్లాలోని గండికోటను ఆంధ్ర రాష్ట్ర ఇరవై సూత్రాల కార్య క్రమముల అమలు ఛైర్మెన్ లంకా దినకర్ సందర్శించారు. అనంతరం టూరిజం మరియు రెవిన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మాధవరాయ దేవాలయం, గండికోట నిర్మాణంలో పెమ్మసాని వారి చరిత్ర మరువ లేనిదని, అత్యంత సుందర వైభవాన్ని అద్భుత శిలా నైపుణ్యం ఇక్కడ ప్రతిబింబిస్తుందని, గండి కోట గత వైభవం సౌందర్య దృశ్యాలను ప్రత్యక్షంగా చూడటం జరిగిందని గండి కోటను అంతర్జాతీయ మౌళిక సదుపాయాల కల్పన ద్వారా అభివృద్ధి చేయాలని గండి కోటకు వచ్చు పర్యాటకులకు వసతి సౌకర్యాలు కల్పించాలని రాకపోకలకు అవసరమైన రవాణా సౌకర్యాలు కల్పించాలన్నారు. పర్యాటకులకు సౌకర్యార్థం ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి మ్యూజికల్స్ సాంప్రదాయ వస్తువులను ఉంచాలని మిని థియేటర్ ఏర్పాటు చేసి తెలుగు భాష గొప్పదనం వేమన, అన్నమాచార్య మహ కవులు రూపొందించిన గ్రంథాలను ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ ఏర్పాటు చేయబోతున్న సమాచార భవనము నకు వచ్చే పర్యాటకులకు వివరాలను తెలియ పరిచే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 77.92 కోట్ల రూపాయల కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మూలధన వ్యయం కోసం ప్రత్యేక సహాయం నిధుల వినియోగం ద్వారా పర్యాటక ప్రదేశాల అభివృద్ధి మరియు పర్యాటకులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన మౌళిక సదుపాయాల కల్పన కోసం సూచనలు ఇవ్వడం జరిగింది. ఇక్కడ పర్యాటక రంగం అభివృద్ధి కోసం 1100 ఎకరాల భూమిని రెవిన్యూ శాఖ వారు పర్యాటక శాఖకు అప్పగించారని 50 ఎకరాల భూమిని ఒబెరాయ్ హెూటల్స్ వారికి కేటాయించారని మరియు అడ్వెంచర్ ట్రెకింగ్ తదితర సౌకర్యాల పైన అధికారులతో సమీక్ష జరిగింది. ప్రస్తుతం 20 వేల మంది పర్యాటకులు ప్రతినెల గండికోటకు వస్తున్నారుని సరైన ప్రమాణాలతో సౌకర్యాలు కలిపిస్తే నెలకు కనీసం ఒక లక్ష మంది పర్యాటకులను ఇక్కడికి ఆకర్షించవచ్చని తద్వారా ఇక్కడ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మరియు రాష్ట్రానికి స్థూల ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమములో టూరిజం, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

కడప కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా

విశాలాంధ్ర-కడప రూరల్ : మధ్యాహ్న భోజన పథకములో వంట ఏజెన్సీ కార్మికులుగా పనిచేస్తున్న 2003 నుండి ఇంతవరకు వంట కొనసాగుతున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని నైట్ వాచ్మెన్ లకు పెండింగ్ లో ఉన్న ఐదు నెలల వేతనాలు తక్షణమే విడుదల చేయాలని సోమవారం కడప కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటియుసి ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ నాగసుబ్బారెడ్డి డిప్యూటీ జనరల్ సెక్రటరీ కెసి.బాదుల్లా మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చాంద్ బాషా కార్యదర్శి సులోచనమ్మ లు మాట్లాడుతూ ఐదు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ చేరూకూరి శ్రీధర్‌కి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ ధర్నాలో ఏఐటియుసి నగర అధ్యక్షులు పి సుబ్బరాయుడు నాయకులు అనిల్ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు శంకరయ్య లక్ష్మిపార్వతమ్మ శారదమ్మ రవణమ్మ బీబీ లక్ష్మీదేవి సుబ్బయ్య పీరయ్య కళావతి వెంకట సుబ్బారెడ్డి రాజా నరసింహులు శ్రీనివాసులు చంద్రశేఖర్ వెంకటరమణ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

శీలంవారి పల్లె దళితవాడలో పర్యటించిన సిపిఐ నాయకులు

విశాలాంధ్ర - బద్వేలు : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బద్వేల్ పట్టణ కార్యదర్శి పెద్దుల్లపల్లి బాలు. ఆధ్వర్యంలో శిలం వారి పల్లె దళిత వాడ సందర్శించారు ఈ సంద ర్భంగా బాలు మాట్లాడుతూ. అక్కడ ప్రధా నంగా డ్రైనేజీ కాలువలు క్లీన్ చేయక పోవడం కారణంగా డ్రైనేజీ వాటర్ ఎటు పోనటువంటి పరిస్థితి డ్రైనేజీ ఇండ్లలోకి పోతున్న మున్సిపల్ అధికారులు సచివాలయాల సిబ్బంది పట్టించు కోకపోవడం దుర్మార్గమన్నారు మున్సిపాలిటీలో ఉన్న దళితుల కాలనీలలో అధికారులు దృష్టి పెట్టి డ్రైనేజీ సమస్య వాటర్ సమస్య కరెంటు సమస్య రాకుండా చూడాలని లేనిపక్షంలో దళిత కాలనీలలో సిపిఐ పార్టీ పర్యవేక్షించి సమస్యల పైన దృష్టి పెట్టి పోరాటం నిర్వహిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి పొంగూరు నాగరాజు జిల్లా సమితి సభ్యులు పడిగ వెంకటరమణ పట్టణ నాయకులు ముని శీలం వారిపల్లి గ్రామవాసులు పాల్గొన్నారు.

బస్సులో ప్రయాణికునికి ఫిట్స్

విశాలాంధ్ర-సంబేపల్లె: అది ప్రైవేట్ బస్ సర్వీస్ (ముల్బాగల్) పుంగనూరు నుంచి రాయచోటికి ప్రతినిత్యం వస్తుంది. సోమవారం బస్సులో ప్రయాణిస్తున్న పుంగనూరు పట్టణం వెలగటూరుకు చెందిన సుబ్రహ్మణ్యం ప్రయాణికుడు ప్రయాణం చేస్తూ మార్గమధ్యంలో పెట్స్ రాగానే స్పృహ కోల్పోయాడు. తోటి ప్రయాణికులు బస్సు సిబ్బందికి తెలియజేయడంతో మార్గమధ్యంలో సంబేపల్లె ఆరోగ్య కేంద్రం వద్ద బస్సు ఆపి వైద్యుడికి సమాచారం అందించారు. వైద్యుడు సూర్యనారాయణ రెడ్డి వెంటనే బసవద్దకు చేరుకొని అతని ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి ప్రథమ చికిత్స అందించారు. పిట్స్ వచ్చిన వ్యక్తి తేరుకోవడంతో తోటి ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సకాలంలో ఫిట్స్ వ్యాధిగ్రస్తుడికి వైద్యం అందించడంతో శభాష్ డాక్టర్ అంటూ పలువురు కొనియాడారు.

గ్యారంపల్లి పిహెచ్‌సి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

అత్యవసర చికిత్స కోసం గాయాలతో పి.హెచ్.సి కి వెళ్లిన యువకులు - పిహెచ్‌సికి తాళం

విశాలాంధ్ర- పీలేరు: ఆదివారం సాయంత్రం, గ్యారంపల్లి పిహెచ్‌సి తాళం వేసి విధుల్లో నిర్లక్ష్యం వహించిన సంబంధిత సిబ్బందిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అమృత్ తేజ మాట్లాడుతూ ఇద్దరు యువకులు గాయాలతో చికిత్స కోసం గ్యారంపల్లి పి.హెచ్.సి కి వెల్లడం జరిగింది కానీ పి.హెచ్.సి కి తాళం వేసి ఉండటం చూసి ఇక్కడ హాస్పిటల్ అందుబాటులో ఉందో లేదో అనే ఆశ్చర్యానికి గురవడం జరిగింది వారు తెలియజేసినట్టు తెలిపారు. యువకులు పి.హెచ్.సి కి చేరిన అరగంట దాటిన తర్వాత సిబ్బంది హాస్పిటల్ కు రావడం చాలా బాధాకరమని అని అన్నారు. సరైన సమయంలో అత్యవసర చికిత్స అందకపోవడం వల్ల ఎన్నో ప్రాణాలు పోవడం మనందరికీ తెలిసిన విషయమని గుర్తు చేశారు. వైద్య సిబ్బంది పి.హెచ్.సి పరిధిలో ఉండే విధంగా వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కావున సంబంధిత వైద్య శాఖ ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పందించి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గ్యారంపల్లి పి.హెచ్.సి సిబ్బందిపై విచారణ జరిపి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

సీజనల్ వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర - బద్వేలు : మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ సామాజిక ఆరోగ్య కేంద్రము, టి. నరసింహా రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్, ఈ నెలలో జరుగుతున్న డెంగ్యూ మసోత్స వము గురించి, దోమలు అభివృద్ధి అయ్యే ప్రాంతాల గురించి, వాటి నివారణ చర్యలు గురించి, దోమ కాటు వల్ల, కలుగు మలేరియా, ఫైలేరి యా, డెంగ్యూ, చికున్ గునియా, మెదడు వాపు జ్వరం, పచ్చ జ్వరం, మొదలగు జ్వరాలు రాకుండా, ఉండాలంటే, ప్రజల అందరి భాగస్వామ్యం తో దోమలను అదుపు చేసి నప్పుడే దోమల ద్వారా వచ్చే వ్యాధులను నివారించ గలమని తెలియచేసారు, సామజిక ఆరోగ్యకేంద్రం బద్వేల్, సూపరింటెండెంట్, డాక్టర్ ుబ్బారెడ్డి ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఎటువంటి జ్వరం వచ్చిన వెంటనే సమాజిక ఆరోగ్య కేంద్రం, బద్వేల్ వచ్చి గానీ మీ సమీప,ప్రాథమిక ఆరోగ్య కేంద్రము వచ్చి రక్త పరీక్షలు చేయించు కొని వ్యాధి నిర్ధారణ చేయించుకొని మందులు వాడాలని, అన్ని వసతులు మా దగ్గరే వున్నాయన్నారు. ఎటువంటి జ్వరాలు వచ్చినా వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పోవాలని అన్ని రకాల మందులు మా దగ్గరే వున్నాయని అన్ని కూడ ఉచితమని ప్రజలకు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో గాంధీ నగర్, వైద్యాధి కారి, చరత్ చంద్ర , బద్వేల్ వైద్యాధి కారులు, భరత్, అన్ని విభాగాల వైద్యులు, బద్వేల్, హెడ్ నర్స్, సోమి సుజయంతి,స్టాఫ్ నర్సస్, ఫార్మసీ ఆఫీసర్, నరసింహా రావు, ప్రజలు,పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల

సంక్షేమ బోర్డును పున ప్రారంభించాలి

విశాలాంధ్ర-మదనపల్లె: ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికసంఘం ఏఐటీయూసీ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం నిమ్మనపల్లి మండల తాసిల్దార్ కార్యా లయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ నిమ్మనపల్లి మండల కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమ చట్టం 1996 ను 2006 సంవత్సరం నుండి మన రాష్ట్రంలో అమల్లోకి తెచ్చి గత ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులకు 12 రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. జీవో నెం: 1214 ను రద్దుచేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునః ప్రారంభించి పెండింగులో ఉన్న క్లైమూలకు పరిష్కారం జరిగే విధమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం తాసిల్దారకి విన్నత పత్రం అందజేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపి కార్మికులను ఆదుకోన వలసినదిగా కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎం రామచంద్ర, ఈ శ్రీరాములు చాన్ భాషా, నాగరాజు, నల్లప్ప, గంగాధర్, ఛాన్భాష,ఏనైతుల్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతోనే యానాదులకు న్యాయం

విశాలాంధ్ర-రాజంపేట : ఎస్టీ వర్గీకరణతోనే యానాదులకు న్యాయం జరుగుతుందని యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కల్లూరు చిన్న పెంచలయ్య యానాది అన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పులి శివశంకర్ ఆధ్వర్యంలో రాజంపేట పాత బస్టాండ్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు డప్పులు మొగిస్తూ, నృత్యం చేస్తూ యానాదులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్టీ వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయాలని కోరుతూ యానాది రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కల్లూరు చిన్న పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు పది లక్షల మంది యానాదులు ఉన్నారన్నారు. రాష్ట్రంలో గిరిజన తెగలలో అత్యధిక జనాభాగా ఉన్న యానాదులు నేటికీ అన్ని రంగాలలో వెనకబడి ఉన్నారన్నారు. ఎస్.సి వర్గీకరణ వలె ఎస్టి వర్గీకరణ కూడా చేసి యానాదులకు అందవలసిన ప్రభుత్వ ఫలాలు వారికే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు బాపట్ల బ్రహ్మయ్య, ఉద్యోగులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు చేవ్వూరి సుబ్బారావు, పొన్నూరు అంకమ్మరావు, మలికి చెంచయ్య ,కొమరగిరి మాల్యాద్రి ,మల్లిఖార్జునరావు, దుర్గాప్రసాద్, శ్రీనివాసులు ,మహిళా నాయకురాలు చంబేటి ఉష, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జలకం శివయ్య, జిల్లా ప్రదాన కార్యదర్శి నీలం అంకమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు వెలుగు సుధాకర్, తిరుమలశెట్టి చలపతి, సికోలు బాలాజీ, మేకల వెంకటరమణ, పులి విశ్వనాథ్, మేకల వెంకటసుబ్బయ్య, చలం వెంకటరమణ, పాలంకోట నాగరాజు, ఒంటేల మనోహర్ అల్లం నరసింహులు, కానూరు రుక్మిణమ్మ, యల్లంపల్లి అంకమ్మ, ఉమ్మడి సుబ్రహ్మణ్యం, యానాది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ నిబంధనలను పాటించాలి

విశాలాంధ్ర -మదనపల్లి: మార్కెట్ కమిటీ ప్రతిపాదించిన నిబంధనలను మండి యాజమాన్యం పాటించాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తరిగొండ నోషాద్ సోమవారం పత్రిక విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రంకొండ మార్కెట్ యార్డ్ లో రాష్ట్రంలో ఎక్కడ జరగని విధంగా రైతులకు అన్యాయం జరుగుతున్నదని 100 క్రియేట్ లకు 10 జాక్పాట్ 1000 రూపాయలకు వంద కమిషన్ కూలీ గేటు అనేక విధాలుగా రైతుల నుంచి మండి యాజమాన్యం వసూలు చేస్తున్నదని వాటి అన్నిటిని ప్రభుత్వం జారీచేసిన ఉత్తరమర్రికే తీసుకోవాలని లేని పక్షంలో మండి యాజమాన్యంపై తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు.అలాగే చిన్న క్రియేట్ లను మండి యజమాన్యం అమ్ముల లోకి తీసుకురావాలని కోరారు.

నష్ట పరిహారం చెల్లించి బ్రిడ్జి పనులు మొదలుపెట్టండి

డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 18వ డివిజన్ పరిధిలో ఉన్న విశ్వనాథపురంలో జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి- పరిధిలో స్థానికులకు నష్టపరిహారం చెల్లించి వెంటనే పనులు మొదలుపెట్టాలని లేనిపక్షంలో ప్రజల తరపున పోరాట దీక్ష మొదలు పెడతామని డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి సోమవారం కమిషనర్ మనోజ్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కడప నగర పరిధిలోని 18వ డివిజన్‌లో విశ్వనాథపురంలో జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి పని ఆగిపోయి ఉన్నదనీ అక్కడ ఉన్న ఇండ్లకు కార్పొరేషన్ వారు నష్టపరిహారం చెల్లించలేదు కాబట్టి ఒక సంవత్సర కాలంగా విశ్వనాథపురం ప్రజలకు రాకపోగాలకు తీవ్ర ఇబ్బంది కలిగించుచున్నది కాబట్టి అధికారులకు వెంటనే తగు ఆదేశాలు ఇచ్చి నష్టపరిహారం ప్రజలకు చెల్లించాలని కమిషనర్ ను కోరామన్నారు. బ్రిడ్జికి రెండు వైపులా రైల్వే అధికారులు ఒక చిన్న రోడ్డు మాత్రమే ఏర్పాటు చేస్తా ఉన్నారు దాన్ని కూడా వెడల్పు 15 ఎం అయినటువంటి రోడ్డు నిర్మాణం చేయవలసిందిగా కార్పొరేషన్ నుంచి తగిన సూచనలు సలహాలు అధికారులు ఇవ్వవల సిందిగా కోరమని తెలిపారు. ఈ బ్రిడ్జి పనులు ఆగిపోవడం వలన 16,17,1819,20 డివిజన్ లోని దాదాపు 20 వేల జనాభాకు ఇబ్బంది కలగకుండా తగు ఆదేశాలు ఇవ్వవలసిందిగా అధికారులను కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు షఫీ, బసవరాజ్, సుబ్బరాయుడు, శ్రీ రంజన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, అజుమతుల్లా పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఆగస్టు ఒకటవ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జమ్మలమడుగు నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఆర్డీఓ సాయి శ్రీ తెదేపా నియోజకవర్గ బాధ్యులు భూపేష్ రెడ్డి పరిశీలించారు. పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఎల్లిపాడ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అనంతరం కలెక్టర్ దేవగుడి గ్రామం చేరుకున్నారు. ఈ సందర్భముగా ఆది, భూపేష్ జిల్లా కలెక్టర్ శ్రీధర్‌కు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వగృహంలో కలెక్టర్ కొద్దిసేపు గడిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రాజేష్ రెడ్డితో పాటు పోలీసు అధికారులు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మిట్స్ లో ఆన్ - క్యాంపస్ ప్రీ-ప్లేస్‌మెంట్ కనెక్ట్ కార్యక్రమం

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె సమీపం లోని మిట్స్ (మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డీమ్డ్ యూనివర్సిటీ నందు ప్లేసెమెంట్ అండ్ ట్రేనినింగ్ విభాగము వారు బి.టెక్ మరియు ఎం.టెక్ చివరి సంవత్సర విద్యార్థులకు టెక్నాలజీ మరియు ప్రొఫెషనల్ సేవలలో ప్రపంచ అగ్రగామి అయిన కాగ్నిజెంట్ రిక్రూట్‌మెంట్ బృందంచే ఆన్ - క్యాంపస్ ప్రీ-ప్లేస్‌మెంట్ కనెక్ట్ కార్యకమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాఘవేంద్ర కులకర్ణి, గ్లోబల్ డెలివరీ పార్టనర్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ మరియు జితేందర్ సింగ్, హెచ్ ఆర్ సీనియర్ మేనేజర్, కాగ్నిజెంట్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర కులకర్ణి మాట్లాడుతూ ఉద్భవిస్తున్న పరిశ్రమ ధోరణులు, డిజిటల్ పరివర్తనలో ఆవిష్కరణ పాత్ర మరియు భవిష్యత్తులో సిద్ధంగా ఉన్న కెరీర్‌ను నిర్మించడానికి విద్యార్థులకు అవసరమైన ముఖ్యమైన నైపుణ్యాల గురించి విలువైన అంతర్దృష్టులను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమం లో జితేందర్ సింగ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆన్లైన్ టెస్ట్ పై కావలసిన అవగాహన తో పాటు సేల్స్ ఫోర్స్ సర్వీస్ నౌ మరియు జావా పై పట్టు ఉండాలని విద్యార్థులతో అన్నారు. ఈ ఇంటరాక్టివ్ సెషన్ లో మిట్స్ యూనివర్సిటీ విద్యార్థులు కాగ్నిజెంట్ బృందంతో నేరుగా చర్చించడానికి వీలు కల్పించింది, కంపెనీ పని సంస్కృతి మరియు కెరీర్ వృద్ధి అవకాశాలపై వారి అవగాహనను పెంచింది అని ప్లేసెమెంట్ హెడ్ వేణు చౌదరి అన్నారు. యువ ప్రతిభను శక్తివంతం చేయడంలో నిరంతర సహకారం మరియు మద్దతు ఇచ్చినందుకు కాగ్నిజెంట్ నియామక బృందానికి యూనివర్సిటీ యాజమాన్యం తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

కూటమి కుట్రలతోనే ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు

ఎంపికి బెయిల్ రావాలని 101 కొబ్బరి కాయలు సమర్పణ

విశాలాంధ్ర- పీలేరు: ఎంపీ. మిద్దున్ రెడ్డి కడిగిన ముత్యంల జైలు నుండి బయటికి రావాలని, అలాగే త్వరగా బైలు రావాలని పీలేరు యుంగ్ స్టార్ వైసీపీ నేత, వైస్సార్సీపీ యువజనజిల్లా కార్యదర్శి సునీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు స్థానిక శివాలయంలో101 కొబ్బరి కాయలు కొట్టి దేవుని ప్రత్యేకంగా ప్రార్థించారు. ఎంపీ. బయటకు వచ్చేంత వరకు తాము పాదరక్షకులు కూడా వేసుకోకుండా ప్రతి రోజు అన్ని ఆలయాల్లో తిరిగి ప్రార్థనలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులకు సన్మానం

విశాలాంధ్ర - బద్వేలు : ఈనెల 22 23వ తేదీ జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కడప జిల్లా మహాసభలు బద్వేలు లో చాలా అట్టహాసంగా జరిగాయి ఈ మహాసభలలో నూతన కమిటీ కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది మూడు సార్లు జిల్లా కార్యవర్గ సభ్యునిగా వి వీరశేఖర్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.బద్వేల్ ప్రాంతం నుండి పెద్దుల్లపల్లి బాలు ను కూడా నూతన కార్యవర్గ సభ్యునిగా ఎన్నుకున్నందున సోమవారం బద్వేల్ పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వారికి సాలువ కప్పి పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలియజేయడం జరిగింది,

ఎరువుల కొరతను తీర్చాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కడప జిల్లా సమితి

విశాలాంధ్ర-కడప రూరల్ : కడప జిల్లాలో ఎరువుల కొరతను తీర్చాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ చెరుకూరు శ్రీధర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. వి. సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత, కృత్రిమ కొరతతో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎన్నో సమస్యలను అధిగమించి ఈ రోజులలో రైతులు వ్యవసాయం చేస్తా ఉన్నారని, సకాలంలో రైతులకు కావాల్సిన ఎరువులను రైతు సేవ కేంద్రాల ద్వారా అందించవలసిన ప్రభుత్వం రైతు సేవ కేంద్రాలకు తగినంతగా ఎరువులను అందించకపోవడం వల్ల కొంతమంది ఎరువుల దుకాణదారులు కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు ఎరువులను రైతులకు అమ్ముతున్నారని, ప్రస్తుతం జిల్లాలో యూరియా కొరత రైతులను వేధిస్తున్నదని దుకాణదారులు అధిక ధరలతో యూరియాను విక్రయిస్తున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారు. అధిక ధరలకు విక్రయించటంతో పాటు ఇతర ఎరువులను కొనాలని షరతులు విధిస్తున్నారని ఇది చాలా అన్యాయమని, జిల్లాలో సాధారణ సాగుకు అవసరమైన 69 వేల 600 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉండగా, ప్రభుత్వం 40,390 మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించగా అందులో జిల్లాకు వచ్చిన దాన్ని బట్టి చూస్తే ఈ ప్రభుత్వానికి ఈ జిల్లాపై ఏమైనా వివక్ష ఉన్నదా అన్నట్లుగా అర్థమవుతున్నదిని, 20,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, 12 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించి, జిల్లాకు ఇచ్చినది మాత్రం 3062 మెట్రిక్ టన్నులే ఇందువల్లనే యూరియా సమస్య జిల్లాలో ప్రధాన సమస్య అయిందని, 9800 మెట్రిక్ టన్నుల డి ఏ పి అవసరం కాగా 4800 మెట్రిక్ టన్నులుగా కేటాయించి చివరకు ఇచ్చింది 18 వందల టన్నులు మాత్రమే ఈ విధంగా కేటాయింపులలోనే కోతలు విధించి కేటాయించి, ఆ కేటాయింపులలో కూడ అర, కోరగానే జిల్లాకు ఎరువులను ఇవ్వడం ద్వారా ఎరువుల సమస్యలతో జిల్లాలోని రైతులు ఇబ్బందులు పడుతు న్నారని, ఇప్పటికైనా జిల్లాలో రైతులకు కావలసిన ఎరువులు అన్నింటిని రైతు సేవా కేంద్రాల ద్వారా అందించి రైతులు ఎరువుల సమస్యతో ఇబ్బంది పడకుండా చూడవలసిన బాధ్యత ఈ రాష్ట్ర ప్రభుత్వం పైన, జిల్లా అధికార యంత్రాంగం పైన ఎంతైనా ఉన్నదని ఎరువుల సమస్య లతో ఇలాగే రైతులు ఇబ్బందులు పడుతూ ఉంటే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలను, నిరసన లను తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తూ వారు మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఈ. బాల చంద్రయ్య నాయు డు, జిల్లా సమితి సభ్యులు ఎల్.వి.భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

పీలేరు సమస్యలను పరిష్కరించండి

- జిల్లా 5 వ స్థాయి సంఘ సమావేశంలో జడ్.పి కో ఆప్షన్ సభ్యులు షఫి

విశాలాంధ్ర - పీలేరు : పీలేరు సమస్యలు పరిష్కరించాలి అని ఉమ్మడి చిత్తూరు జిల్లా కో ఆప్షన్ సభ్యులు షఫి అన్నారు. శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా 5వ స్థాయి సంఘ సమావేశం జరిగింది. ఈ సమావే శంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కోఆప్షన్ సభ్యులు, ఐసిడిఎస్ స్టాండింగ్ కమిటీ సభ్యులు షఫి పీలేరు మేజర్ గ్రామపంచాయతీలను సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన దివిటి న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ పీలేరు మేజర్ గ్రామపంచాయతీలో జరుగుతున్న వంతెన, జాతీయ రహదారి విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆలస్యంగా జరుగుతున్న పనుల వల్ల ఇటు వ్యాపారస్తులకు అటు ప్రజలకు ఆర్థికంగానే కాకుండా ఆరోగ్యపరంగా కూడా రోగాల బారిన పడుతున్నట్లు తెలిపారు. అంగన్వాడి భవనాలను కొరత లేకుండా చూడాలని అన్నారు. గ్రామపంచాయతీలో నీటి సిద్ది కేంద్రాలలో పని చేసే వాటర్ మెన్స్ కు వెంటనే నిల్వ ఉన్న జీతాల బకాయిలను విడుదల చేయాలని సూచించారు.

స్వీపర్లకు పెండింగ్ జీతాలను విడుదల చేయాలి

మేయర్, అడిషనల్ కమిషనర్‌కు ఏఐటీయూసీ వినతి

విశాలాంధ్ర-కడప రూరల్ : కడప నగరపాలక సంస్థ పరిధిలో ఉండే ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్ వర్కర్లకు 3 నెలలు పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు గారికి అడిషనల్ కమిషనర్ రాకేష్‌కి ఏఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి బాదుల్లా నగర అధ్యక్షులు పి సుబ్బరాయుడు నాయకులు సునీల్ లు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు స్వచ్ఛతకు పెద్దపీట వేస్తున్నామని చెప్పే మాటలకు వాస్తవ పరిస్థితులకు పొంతన ఉండటం లేదన్నారు ప్రతినెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, సంవత్సరానికి రెండు జతల యూనిఫారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వీపర్ల యూనియన్ నాయకురాలు నాగరత్నమ్మ షేక్ శు న్నిషా జకీయా జరినా షాహిన అక్బరున్నిషా తదితరులు పాల్గొన్నారు.

మిథున్ రెడ్డికి వసతులు కల్పించలేమని చెప్పడం దుర్మార్గం

రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

విశాలాంధ్ర- పీలేరు: ఆధారాలు లేని తప్పుడు కేసులో అక్రమంగా అరెస్టు చేసిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి రాజమండ్రి జైలులో ప్రజా ప్రతినిధికి కల్పించాల్సిన వసతులను కూడా కల్పించ లేమని అధికారులు పేర్కొనడం దుర్మార్గమని రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మైనారిటీ నాయకులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని తిరుపతిలోని స్వగృహంలో కలిశారు. ఈసందర్భంగా ఎంపీ మిథున్ రెడ్డికి రాజమండ్రి జైలులో అందుతున్న వసతులు, అక్కడి పరిస్థితులను గురించి అడిగి తెలుసు కున్నారు. కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా కక్ష సాధింపు ధోరణిలోనే వ్యవహరిస్తోందని , కోర్టు ఆదేశాలను, చట్టాలను సైతం తుంగలోకి తొక్కుతోందన్నారు. మైనారిటీ నాయకులు ఆబిద్, అమిన్ పీర్, సమీ,ఇమ్రాన్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

విశాలాంధ్ర-రాయచోటి: ప్రతి ఒక్కరు ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ సూచనల మేరకు పిసిఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రీ భారతీయ విద్య భవన్ స్కూల్, సన్ రైస్ నందు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమాలలో ప్రాజెక్ట్ మేనేజర్ టి.స్వాతి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది ఎలా వ్యాపించదు, ఎయిడ్స్ వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలను తెలిపారు. శ్రీ భారతీయ విద్య భవన్ స్కూల్ హెడమాస్టర్ డి.సువని మల్లీశ్వరి మాట్లాడుతూ ఎయిడ్స్ గురించి మాదక ద్రవ్యాల విషయాలను గుర్తుచేస్తూ భవిష్యత్తులో విద్యార్థులు ప్రయోజకులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సుప్రజ, శ్రావణి, రామాజినేయులు రెడ్డి, ప్రసాద్, రజియా, పిసియస్ యస్ ఓఆర్ డబ్ల్యుఎస్ సుహాసిని, అంజనమ్మ పిఇ సంపూర్ణ, శివరాణి పాల్గొన్నారు.

పీలేరు నియోజకవర్గ కార్యదర్శిగా టీఎల్ వెంకటేష్

విశాలాంధ్ర - పీలేరు : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శిగా టీఎల్ వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు సోమవారం పీలేరు సిపిఐ కార్యాలయంలో ప్రతినిధుల సమావేశం జరిగింది సమావేశంలో సిపిఐ పీలేరు నియోజకవర్గ నూతన కమిటీని సిపిఐ జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది పీలేరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా టిఎల్ వెంకటేష్ ను రెండవసారి ఎన్నుకోవడం జరిగింది ఆయనతోపాటు సహాయ కార్యదర్శిలుగా నరసింహులు ,పివి రమణ కార్యవర్గ సభ్యులుగా 11 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టి ఎల్ వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గ కార్యదర్శిగా రెండవసారి తనను ఎన్నుకున్న జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి విప్లవ అభినందనలు తెలిపారు. అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని పోరాటం చేస్తామన్నారు.

కమలాపురం ఏపీ ఎన్జీజివో ఎన్నికలు ఏకగ్రీవం

- అధ్యక్ష, కార్యదర్శులుగా రత్నం, వెంకట సుబ్బయ్య

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: కమలాపురం ఏపీ ఎన్జీవో ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఏపీ ఎన్జీవో కమలాపురం తాలూకా ఎన్నికలు కడప ఎన్జీవోహంలో ఏకగ్రీవంగా పూర్తయ్యాయి. సోమవారం కమలాపురం తాలూకా యూనిట్ ఎన్నికలను కడప ఎన్జీవో హోంలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా నరేంద్ర, సహాయ ఎన్నికల అధికారి పోల్‌రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి నరేంద్ర మాట్లాడుతూ కమలాపురం యూనిట్ తరఫున మొత్తం 12 మంది కార్యవర్గ సభ్యులు నామినేషన్ వేయవలసి ఉండగా 12 మంది సభ్యులు మాత్రమే నామినేషన్ వేయడంతో ఎన్నికల అధికారి 12 స్థానాలకు ఒక్కొక్క రావడంతో పోటీ లేకుండా అందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ప్రెసిడెంట్ వెంకట రత్నం, సహా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఇ.వెంకటేశ్వర్లు, కొండారెడ్డి, వసంత (ఉమెన్), పవన్ కుమార్, కార్యదర్శి వి.వెంకట సుబ్బయ్య, జాయింట్ సెక్రటరీస్ వి.సాదిక్, కె.నాగ మునిరెడ్డి, పి ముని కృష్ణయ్య తులసి (ఉమెన్), కోశాధికారి కె.లక్ష్మయ్య ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. కార్యవర్గము మూడు సంవత్సరములు కొనసాగుతుందని తెలిపారు. ముఖ్య అతిథులు జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియ జేశారు. బి.శ్రీనివాసులు మాట్లాడుతూ పెండింగ్ డిఏలు, పిఆర్సి, సరెండర్ బిల్లులు, మెడికల్ డిపార్ట్మెంట్ ఎఫ్‌టిపి బిల్లులు రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ త్వరలో ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు టి. శ్రీనివాసులు, బాల పుల్లయ్య, సీటీ అధ్యక్షులు చిన్నయ్య, పద్మనాభం, యన్ జి జి వో నాయకులు నాగలక్ష్మీరెడ్డి, సిద్దయ్య పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రిలీఫ్ ఫండ్ పేదలకు వరం అని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి పేర్కొన్నారు. ఓబులవారిపల్లి మండలంలోని బోటుమీదపల్లి గ్రామ పంచాయతీలోని కాకర్లవారిపల్లి గ్రామ వాస్తవ్యులు పోలిన సుబ్బరాయుడు కు మంజూరు అయిన సిఎం రిలీఫ్ ఫండ్ రూ 84, 928వేల రూపాయలు, అన్నంగి రామలక్ష్మకు రూ 71,664 వేల రూపాయలు చెక్ ను ఎమ్మెల్యే, మరియు ముక్కా వరలక్ష్మి చెక్ ను తీసుకుని స్వయంగా భాదితుని ఇంటికి వెళ్ళి ఆప్యాయంగా పలకరించి చెక్ ను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీకు మేము అండగా ఉంటాం అధైర్యపడవద్దు అని భరోసా ఇచ్చారు. సిఎం రిలీఫ్ ఫండ్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలిఅడుగు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: పట్టణంలోని బూత్ నెంబర్ 51లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన ప్రజాసంక్షేమ పథకాల గురించి ప్రజలు వివరించారు. ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేయడం ఒక్క తెలుగుదేశం పార్టీకే సాధ్యం అని ప్రజలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ సీతా వెంకట సుబ్బయ్య, బూత్ ఇంచార్జ్ మొగల్ జీలని బాషా, తోరుమలయ్య, ఒరుగంటి నాగరాజు, దుద్యాల మౌలాలి, గద్దం వెంకటేశ్వర్లు, మద్దురాముడు, నెట్టల జమాల్ వాలి (హంబి) కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు గౌరవ వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల కు గౌరవ వేతనం ఇవ్వాలని సీనియర్ జర్నలిస్టు బి సుధర్శన్ శర్మ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం శర్మ పాత్రికేయులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ బీహార్ ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని జర్నలిస్టులకు నిన్న మొన్నటి వరకు నెలనెలా 6000 వేల రూపాయలు ఇస్తూ వచ్చారు. ఇటీవల బీహార్ ప్రభుత్వం 6000 వేల రూపాయల నుంచి 15000వేల రూపాయలకు పెంచి జర్నలిస్టులను అదుకుంటున్నారన్నారు. అదే తరహా ఆంధ్రప్రదేశ్ లో పనిచేస్తున్న జర్నలిస్టులకు కూటమి ప్రభుత్వం కూడ జర్నలిస్టులకు గౌరవ వేతనం మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. జర్నలిస్టుల జీవన పరిస్థితులు దారుణంగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి జర్నలిస్టులకు గౌరవ వేతనం మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాల్సిందే: సీపీఐ

విశాలాంధ్ర-తొండూరు: స్మార్ట్ మీటర్ల పేరు తో అంబానీ, ఆదానీ అక్రమార్జనే ధ్యేయం గా కూటమి ప్రభుత్వ వైఖరి ప్రజా వ్యతిరేక విధానం అని స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు ఆరోపించారు అధికారంలో లేనప్పుడు గత ప్రభుత్వం పైన చంద్రబాబు, లోకేష్ స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టండి పిలుపునిచ్చి ఇవాళ మోడీ ప్రభుత్వానికి, అంబానీ, అదానిలకు లొంగిపోయి రాజకీయ అవసరాల కోసం ప్రజల పైన కోట్ల రూపాయల భారాన్ని మోపుతున్నారని మండిపడ్డారు. అదేవిధంగా సెకి ఒప్పందం ద్వారా జగన్ సర్కార్ 1750కోట్ల రూపాయలు అక్రమాలకు పాల్పడిందని ఆరోపించిన ప్రస్తుత పాలకులు అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం దాటినప్పటికీ ఎలాంటి చర్యలు లేకుండా నిమ్మకు నీరెక్కినట్టు వ్యవహరిస్తుందని ఆ అక్రమార్జనపై ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలను పెంచితే ప్రజలను దోచుకుంటుంది అని ఆరోపించిన ప్రస్తుత పాలకులు అధికారంలోకి వచ్చినా ఈ 13 మాసాలలో విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచి ప్రజల పైన దాదాపు 15426 కోట్ల రూపాయల భారాన్ని మోపిందని తెలియజేశారు ఈ ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోకపోతే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాదు నగరంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా జరిగిన బషీర్బాగ్ పోరాటం వామపక్షాల, ప్రజాసంఘాల, ఆధ్వర్యంలో మరొక్కసారి పునరావృతం అవుతుందని హెచ్చరించారు సమావేశంలో సిపిఐ పులివెందుల ఏరియా నాయకులు ఈశ్వరయ్య, అమీర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యమునకు పాల్పడవద్దు

విశాలాంధ్ర-ఖాజీపేట: మైదుకూరు నియోజకవర్గంలోని మైదుకూరు, ఖాజీపేట, దువ్వూరు, చాపాడు మండలంలలో ఉన్న విద్యుత్ వినియోగదారులు తమకు సంబంధించిన విద్యుత్ వాడకము మీద ఏ కారణం చేత కూడా విద్యుత్ చౌర్యమునకు పాల్పడవద్దు అని మైదుకూరు సబ్ డివిజన్ అధికారి, జై శ్రీకాంత్ విద్యుత్ వినియోగదారులకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అవసరం అయిన మేరకు విద్యుత్ వాడుకుంటూ కొంచెం పొదుపుగా ఉంటే విద్యుత్ బిల్లులు కూడా తక్కువలో వస్తాయని వీటిని గమనించకుండా పట్టణాలలో కూడా కొన్ని చోట్ల, గ్రామంలో కొంచెం అధికంగా విద్యుత్ చౌర్యమునకు పాల్పడుతూ ఉండటం, దీని మీద విద్యుత్ డిపార్ట్మెంట్ విజిలెన్స్ వారు తరచూ తనిఖీ చేస్తూ ఇటువంటి వారిని గుర్తించి అధిక మొత్తంలో వేల రూపాయల అపరాధ రుసుము విధిస్తూ ఉండటం జరుగుతుందన్నారు. దీని వల్ల కొందరు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ఉండడం, కొన్ని చోట్ల ఇటువంటి చౌర్యం చేసే సమయంలో ప్రమాదమునకు గురి అయి చనిపోవటం, శరీరం కాలిపోవటం వంటి సంఘటనలు జరుగుతూ ఉన్నాయన్నారు. సర్వీసు అధికారికంగా తీసుకోకుండా ఇంకా నేరుగా విద్యుత్ వాడుతున్న కేసులు కూడా ఇంకా ఎక్కువ స్థాయిలో ఉన్నాయని ఇటువంటి వారు వెంటనే స్పందించి మీ మండల అధికారిని కలిసి విద్యుత్ సర్వీసు తీసుకోవాలని ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల వాసులు కూడా తమకు ప్రభుత్వము వారు కల్పిస్తున్న నెలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం ఉపయోగించుకుని అందరూ డిపార్ట్మెంట్ నుండి అధికారిక సర్వీసు తీసుకోవాలి. జాతీయ సంపద అయిన విద్యుత్ చౌర్యం చేయటం అనేది ఏ కారణం చేత కూడా ఆమోదించదం జరుగదని వినియోగదారులందరూ అధికారుల కు నష్టపోకుండా సహకరించాలని తెలిపారు.

మిశ్రమ స్పందనలో టిడిపి కార్యకర్తలు!

- 14 నెలలు గడిచినా కనిపించని ఉత్సాహం

విశాలాంధ్ర-అట్లూరు: ఎన్నికలు పూర్తయి 14నెలలు పూర్తిచేసుకోని రెండో ఏడాదిలోకి అడుగుపెట్టిన టిడిపి కార్యకర్తలకు ఊహించినట్లుగా పనులు జరగడం లేదని తెలుగుదేశం పార్టీనాయకులు, కార్యకర్తలు లోలోన మదన పడుతున్నారు. అధినాయకత్వం నుంచి కూడా స్పందన తక్కువగా ఉన్నట్లు స్థానికులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. పాలకులు పరిస్థితులు లను గమనించి స్థానిక కార్యకర్తలు, నాయకుల సమస్యలను క్షుణ్ణంగా విని వారికి భరోసా ఇస్తూ ముందుకు సాగాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఏకపక్ష నిర్ణయాలు లేకుండా కేడర్ ను సంప్రదించి కార్యకర్తల మనోభావాలకు పెద్దపీట వేయాలని కోరారు.

గౌరవం తప్పితే.. జాతకాలు బయటపెడతాం..

విశాలాంధ్ర-పులివెందుల: గౌరవం తప్పితే మీ జాతకాలు బయటపెడతామంటూ వైసిపి నాయకులను టిడిపి నాయకులు హెచ్చరించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఏపీ హౌజ్ కమిటీ మెంబర్ షేక్ మహబూబ్ బాషా విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం బిటెక్ రవిపై వైసిపి నాయకులు చేసిన ఆరోపణలను ఖండించారు. సతీష్‌రెడ్డి విలువల గురించి మాట్లాడారన్నారు. మీకు రెండేళ్ల నుంచి సతీష్‌రెడ్డి తెలుసు అని తమకు రెండు దశాబ్దాల కాలంగా ఒకేపార్టీలో ఉన్నామన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. ఏ ఆధారాలతో సతీష్‌రెడ్డి గురించి మాట్లాడుతున్నారో తమకు అర్థంకావటంలేదన్నారు. కానీ అదే బిటెక్ రవి నోరు విప్పితే వైఎస్ కుటుంబ సభ్యులు గేటు కూడా తాకలేవంటూ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌ను తీవ్రంగా హెచ్చరించారు. మీరు నీ సామాజిక వర్గానికి సంబంధించిన కొంత మంది వ్యక్తులను ముద్దనూరు ఆర్అండబి అతిథి గృహానికి వెళ్లి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని కలువలేదా అని ప్రశ్నించారు. కలిశావని తాము ప్రమాణం చేస్తాం అందుకు మీరు సిద్ధమేనా అంటూ వరప్రసాద్‌కు సవాల్ విసిరారు. ఆరు నెలల క్రింత కొంత మంది టిడిపి నాయకులను కలిసి ఎంపీ అవినాష్‌రెడ్డి వల్ల తమకు సుమారు రెండుకోట్ల రూపాయలు నష్టం వచ్చిందని చెప్పలేదా, తాను అనలేదని దేవుడిమీద ప్రమాణం చేస్తావా అన్నారు. అలాగే మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయని వైసిపి నాయకులు చేసిన వ్యాఖ్యలు శుద్ధ అపద్దమన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో మట్కాను పెంచి పోషించారన్నారు. మట్కా డాన్‌తోనే వైసిపి కార్యక్రమాలకు సంబంధించి బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. వేముల మండలం వేల్పుల సింగిల్‌విండో ఎన్నికల నామినేషన్ సందర్భంగా అప్పట్లో అక్కడ కాల్పులు జరిగాయని, ఆ కాల్పుల్లో ఇద్దరు అప్పటి కాంగ్రెస్ నాయకులు చనిపోయారన్నారు. మరి ఆ రోజు వారిపై సతీష్‌రెడ్డి గన్‌మేన్ కాల్పులు జరిపారా లేక సతీష్‌రెడ్డి కాల్పులు జరిపారా అన్న ప్రశ్నకు ఎందుకు సమాధానం చెప్పలేకపోయారో తెలపాలన్నారు. అదే రోజున సతీష్‌రెడ్డి కాల్పులు జరిపారంటూ ఆయనపై కేసులు పెట్టి జైలుపాలు చేశారన్నారు. ఈ రోజున వైఎస్ కుటుంబ సభ్యులు దేవుడిగా కనిపిస్తున్నారా అన్నారు. త్వరలోనే వైసిపి నాయకులు చిట్టాలు విప్పుతాం మీ బండారం బయటపెడతామంటూ హెచ్చరించారు. టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి నల్లగారి భాస్కర్‌రెడ్డి, అమర్‌నాథ్‌యాదవ్‌లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం

విలేకరులు కావలెను

విశాలాంధ్ర కడప, అన్నమయ్య జిల్లాలో దిగువ పేర్కొన్న మండలాలలో పనిచేయుటకు విలేకరులు కావలెను.

ఇంటర్‌మీడియట్ చదివి, తెలుగు భాషా పరిజ్ఞానం కలిగిన వ్యక్తులు అర్హులు.

పనిచేయవలసిన మండలాలు :

కమలాపురం, జమ్మలమడుగు, ఒంటిమిట్ట, దువ్వూరు, వి.యన్.పల్లి, వల్లూరు,
చక్రాయపేట, సిద్దవటం, బద్వేల్ రూరల్, పెద్దముడియం, రాజుపాలెం, చాపాడు, గోపవరం,
బి.కోడూరు, సి.కె.దిన్నె, కాశినాయన, చిట్వేల్, పుల్లంపేట, చిన్నమండ్యం, కె.వి.పల్లి,
కలకడ, కురబలకోట, రైల్వేకోడూరు రూరల్, పీలేరు రూరల్,
తంబళ్లపల్లి, నిమ్మనపల్లి, పెనగలూరు, ఓబులవారిపల్లి, మదనపల్లి రూరల్

వివరాలకు: 99855 89444